J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74
నెల్లూరు, 20.12.2019, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 29 పేజీలు : 12, వెల : ₹ 5





# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## • ప్రాంతాల వారీగా పాలన

# రాష్ట్రానికి 'రాజ'యోగం



కర్నూలు జ్యుడీషియల్ రాజధాని



అమరావతి లెజిస్లేటివ్ రాజధాని



విశాఖ అడ్మినిస్ట్రేషన్ రాజధాని

- చరిత్ర చేసిన తప్పును సరిదిద్దే దిశగా జగన్ నిర్ణయం
- అభివృద్ధి వికేంద్రీకరణతో అన్ని ప్రాంతాలకు న్యాయం
- రియల్ ఎస్టేట్ వ్యాపారం దెబ్బతింటుందని బాబు గగ్గోలు

రాజధానిని రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మలచుకోవాలనుకున్న మాజీముఖ్య మంత్రి, ప్రతిపక్ష నేత చంద్రబాబు కలలు భగ్నం కానున్నాయి. వేలాదిమంది రైతుల నుండి లాక్కున్న 33వేల ఎకరాల భూములతో వ్యాపారం చేసి వేలకోట్లు గడించాలనుకున్న బాబుగారి బృందం ఆశలు సమాధికానున్నాయి. రైతు పొట్టకొట్టిన వాడెవడూ బాగు పడడు... అన్న అక్షర సత్యం మరోసారి ఋజువు కాబోతుంది.

(మిగతా 11వ పేజీలో)



## నెల్లూరంటే... నిర్లక్ష్యమా?

- 'నెల్లి' ఊరు.. 'నిల్లు' ఊరేనా?
- అభివృద్ధిలో ప్రాధాన్యతేది?

రాష్ట్రంలోని మూడు ప్రదాన ప్రాంతాలను అభివృద్ధి చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మూడు రాజధానులను ఏర్పాటు చేయాలని ఆలోచిస్తోంది. అమరావతిలో శాసన వ్యవహారాల రాజధాని, విశాఖలో పరిపాలనా రాజధాని, కర్నూలులో న్యాయ పాలన రాజధాని... అన్నీ బాగానేవున్నాయి. మరి నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిస్థితేంటి? (మిగతా 11వ పేజీలో)




• సీఎం జగన్మోహన్‌రెడ్డి సాహసోపేత నిర్ణయం

# మహిళల భద్రతకు.. దిశ



- దేశ వ్యాప్తంగా సీఎం జగన్‌కు ప్రశంసలు, జేజేలు
- మహిళా భద్రతకు ఇదొక ముందడుగు

(వివరాలు 3వ పేజీలో)



# అక్రమ లేఅవుట్లపై కొరడా

నెల్లూరు జిల్లా పొదలకూరు పరిధిలోని అక్రమ లేఅవుట్లపై జిల్లా కలెక్టర్ నేతృత్వంలో అధికారులు కొరడా ఝుళిపించారు. ఈనెల 15 న పంచాయితీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నెల్లూరు డివిజనల్ పంచాయితీ అధికారి కృష్ణమోహన్ రావు, టౌన్, కంట్రీ ప్లానింగ్ ఏడీ బాబూరావు మాట్లాడుతూ సెప్టెంబర్ నెలలో కలెక్టర్ శేషగిరిబాబు పొదలకూరులోని లేఅవుట్లు పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారని తెలిపారు. 2004 నుంచి 2019 వరకు ఏర్పాటు చేసిన ప్రతి లేఅవుట్ పై నివేదికను కలెక్టర్‌కు ఇచ్చామన్నారు. దీనిపై వారం రోజుల్లో ప్రత్యేక పోలీసు బలగాలతో వెళ్లి అక్రమ లేఅవుట్లలో రహదారులు, కాలువలను తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారని తెలిపారు.

ఆదిలక్ష్మీ అవెన్యూ 5.22 ఎకరాలు, చిన్న హజరత్‌బాబు లేఅవుట్ 5.51 ఎకరాలు, వీవీఆర్ గ్రీన్‌సిటీ 12.04 ఎకరాలు, నరశింహులునాయుడు 2.06 ఎకరాలు, దుగ్గిశెట్టి శ్రీనివాసులు 2.15 ఎకరాలు, బాలాజీ గ్రీన్ సిటీ 17.71 ఎకరాలు, అఖిలాంధ్ర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 21.02 ఎకరాలు, ప్రసన్నలక్ష్మీ గార్డెన్స్ 27.25 ఎకరాలు, అమ్మణ్ణమ్మ అవెన్యూ 12.00 ఎకరాలు, శ్రీనివాసా లేఅవుట్ 31.15 ఎకరాలు, భాస్కర్ లేఅవుట్ 7.66 ఎకరాలు, శ్రీహరి తులసి అశోక్ కుమార్ లేఅవుట్ 8.87 ఎకరాలు, వరసిద్ది వినాయక లేఅవుట్ 2.67ఎకరాలు, పెద మస్తానయ్య 2.02 ఎకరాలు, చాకలి మాన్యం 2.40ఎకరాలు, గాయత్రీనగర్ 12.06 ఎకరాలు, భోగనాథం గోపాల్ 2.68 ఎకరాలు, విఘ్నేశ్వర లేఅవుట్ 4.94 ఎకరాలు, రావుల నారాయణగౌడ్ 10.48 ఎకరాలు, చెంచురామయ్య లేఅవుట్ 8.39 ఎకరాలు, మంజునాథ అవెన్యూ 2.50 ఎకరాలు, సాయిబాబా అవెన్యూ 3.00 ఎకరాల్లో నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లు వేసి విక్రయించారన్నారు. పంచాయితీకి కేటాయించాల్సిన పది శాతం స్థలం ఇవ్వలేదన్నారు. అనుమతి ఫీజు సుమారు రూ.12 కోట్ల వరకు రాలేదన్నారు. కొన్ని లేఅవుట్లలో ప్రజావసరాలకు వదిలిన స్థలాన్ని కూడా విక్రయించారని తెలిపారు. అక్రమంగా గుర్తించిన లేఅవుట్లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పంచాయితీ కార్యదర్శి అల్లాబక్షును ఆదేశించారు.

# ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేసిన జేసీ

నెల్లూరు ప్రభుత్వాసుపత్రిని ఈనెల 14న రాత్రి నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ వినోద్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని పలు విభాగాలను పరిశీలించి రోగులు ఉంటున్న వార్డులను సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. భోజనాన్ని పరిశీలించారు. నర్సుల వద్దనున్న పలు రికార్డులను తనిఖీ చేశారు. నెల్లూరు ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ జేసీ వెంట వున్నారు.

## సమాజాన్ని...
# చైతన్యపరిచేది సాహిత్యమే



'రాచపాళె రత్నావళి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు

బాధ్యతలను విస్మరిస్తే సమస్యలు ఏర్పడతాయని, ఆ పరిస్థితి రాకుండా సమాజంలో మార్పు కోసం కృషి చేయాల్సిన అవసరముందని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పిజే సుధ పేర్కొన్నారు. ఈనెల 14 న నెల్లూరు టౌన్ హాలులో జరిగిన రత్నమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ రజతోత్సవ సభలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని విశ్రాంత కార్మికశాఖ అధికారి, రచయిత డాక్టర్ రాచపాళెం రఘు రచించిన రాచపాళి రత్నావళి గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజాన్ని చైతన్యవంతం చేసే శక్తి సాహిత్యానికే వుందన్నారు. తెలుగు మహాసభ కార్యదర్శి ఐ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నెరసం కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ, ఏపీ హేతువాద సంఘం అధ్యక్షులు నార్నే వెంకటసుబ్బయ్య, నిర్మల నరశింహారెడ్డి పాల్గొని మాట్లాడారు. చీరాలకు చెందిన తెలుగు అధ్యాపకులు డాక్టర్ బీరం సుందరరావు గ్రంథ సమీక్ష చేశారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేష సేవలు చేసిన వారికి జాతీయ పురస్కారాలు, ఆత్మీయ పురస్కారాలు అందజేసి సత్కరించారు.

# రైతుల కోసం టోల్ ఫ్రీ నెంబర్

నెల్లూరు భక్తవత్సలనగర్‌లో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రంలో రైతుల కోసం ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్ ను ఏర్పాటు చేసినట్లు వ్యవసాయశాఖ జేడీ ఆనందకుమారి ఈనెల 17 న తెలిపారు. టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 5979 అన్ని పనిదినాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు పనిచేస్తుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ శేషగిరిబాబు ఆదేశాల మేరకు టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

# 'సమస్యల చెద'లో.. సరస్వతీ నిలయాలు

- నిధులు లేక నీరసపడిన గ్రంథాలయాలు
- సెస్సు బకాయిలు రాక.. తీరని అవస్థలు



సింహపురి సమాచారం

**జిల్లాలో ఏటా లక్షలాదిమంది పాఠకులకు, వేలాదిమంది చిన్నారులు, విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాలు ఇపుడు సమస్యల చెదలో సతమతమవుతున్నాయి. ఎంతోకాలంగా నిధులు లేక అభివృద్ధి కుంటుపడిపోయి అవస్థలతో అల్లాడుతున్నాయి. పంచాయతీల నుంచి, మునిసిపాలిటీల నుంచి, నగరపాలక సంస్థ నుంచి రావాల్సిన సెస్సు బకాయిలు ఏళ్ళ తరబడి రాకపోవడంతో గ్రంథాలయాల మనుగడ నానాటికీ దుర్భరంగా మారుతోంది. జిల్లా ఉన్నతాధికారులైనా గ్రంథాలయాల అభివృద్ధిపై దృష్టి సారించి రావాల్సిన బకాయిలను ఇప్పిస్తే తప్ప.. గ్రంథాలయాలకు మోక్షం ఉండదు.**

గ్రంథాలయాలంటే విజ్ఞాన భాండాగారాలు. ఎంతో జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని పాఠక ప్రజానీకానికి ఉచితంగానే అందించే సరస్వతీ నిలయాలు. భావితరాలను ప్రభావితం చేసే ఎన్నో రకాల పుస్తకాలు, ప్రాచీనమైన మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే ప్రాచీన, అధునాతన గ్రంథాలు, సాహిత్యం.. చరిత్రలకు సంబంధించిన ఎన్నో అమూల్యమైన అపూర్వమైన గ్రంథాలకు నిలయాలుగా ఉండే సరస్వతీ నిలయాలివి. అంతేకాదు విద్యార్థులకు, యువతకు.. నేటితరానికే కాక భావితరాల వారిని సైతం ప్రభావితం చేసి మంచివైపు నడిపించే దేవాలయాలు.. గ్రంథాలయాలే. ఇంత ప్రాముఖ్యత ఉన్న గ్రంథాలయాలు ఇప్పుడు సరైన ప్రోత్సాహం కరవై కష్టాల సుడిలో కొట్టుకుపోతుండడమే విచారకరం. జిల్లాలోని పలు గ్రంథాలయాలకు సరైన భవన వసతి కూడా లేక ఎన్నో ఏళ్ళుగా అద్దె భవనాల్లో ఉంటూ రోజులు గడుపుకుంటున్నాయి. కావలిలో 50 ఏళ్ళనుంచి ఉన్న గ్రంథాలయం అద్దెభవనంలోనే ఉంది. అక్కడి నుంచి దానిని కొత్తభవనంలోకి మార్చాల్సి ఉంది. కానీ స్థల సేకరణ పెద్దసమస్యగా తయారైంది. ఇప్పటికే నెల్లూరులోని నవాబుపేట గ్రంథాలయం, ఉదయగిరి, జలదంకి, కోవూరుల్లో ఉన్న గ్రంథాలయాలకు కొత్తభవనాలు నిర్మించాల్సి ఉన్నా ఇంకా నిర్మాణాలు ప్రారంభమే కాలేదు. సరైన సౌకర్యాలకు కూడా నోచుకోలేని దుర్భరస్థితిలో గ్రంథాలయాలు విలవిల్లాడుతున్నాయి. పుస్తకాలను భద్రపరిచేందుకు తగు వసతులు లేక, ఉరుస్తున్న భవనాల్లో తడుస్తూ ఉండలేక..గ్రంథాలయాలు పడే బాధలు అన్నిన్ని కావు.

## ఏళ్ళు గడుస్తున్నా రాని..13 కోట్ల బకాయిలు

జిల్లాలోని పంచాయతీలు, మునిసిపాలిటీలు, నగరపాలక సంస్థ ప్రజల నుంచి వసూలుచేసే పన్నుల్లో గ్రంథాలయాల సెస్సు కూడా ఒకటి. అయితే, ఆయా సంస్థలు పన్నులు భేషుగ్గానే వసూలు చేసుకుంటున్నా అందులోంచి గ్రంథాలయాలకు రావాల్సిన సెస్సులు మాత్రం ఇవ్వడం లేదు. ఇదే ప్రధానంగా గ్రంథాలయాల సమస్యలకు మూలకారణంగా ఉంటోంది. జిల్లాలోని 46 మండలాల్లో మొత్తం 61 గ్రంథాలయాలున్నాయి. వీటికి రావాల్సిన సెస్సు బకాయిలు సుమారు 13 కోట్ల రూపాయలకు పైగానే ఉందంటే అతిశయోక్తి కాదు. ఒక్క నెల్లూరు నగరపాలక సంస్థ నుంచే సుమారు 7 కోట్ల దాకా సెస్సు బకాయిలు రావాల్సి ఉందని తెలుస్తోంది. వారు కరుణించి ఆ నిధులు ఇస్తే తప్ప గ్రంథాలయాల అభివృద్ధికి మరో మార్గం లేదు. గ్రంథాలయాల నిర్వహణకు నిధులు లేక ఏళ్ళ తరబడిగా నిత్యం అవస్థలు పడుతూనే ఉన్నప్పటికీ ఆయా సంస్థల నుంచి సహకారం అందకపోవడంతో జిల్లాలో ఎన్నో గ్రంథాలయాల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది.

## కంప్యూటర్లు లేవు.. కొత్త పుస్తకాలూ లేవు

జిల్లా కేంద్రమైన నెల్లూరులో కేంద్ర గ్రంథాలయం ఉంది. ఇది నూరేళ్ళ నాటిది. జిల్లాలో ప్రసిద్దికెక్కిన ఈ గ్రంథాలయం గతంలో నిత్యం పాఠకులతో క్రిక్కిరిసి ఉండేది. యువకులు, విద్యార్థులు ఎంతో ఆసక్తితో ఇక్కడికొచ్చి పుస్తకాలు చదువుకునేవారు. ముఖ్యంగా పేద విద్యార్థులకు అవసరమైన కాంపిటేటివ్ బుక్స్ కూడా లభ్యమవుతుండడంతో విద్యార్థులు కూడా పెద్దసంఖ్యలోనే వచ్చేవారు. అయితే, ఇప్పుడా పరిస్థితి మారిపోయింది. ఈ గ్రంథాలయం కూడా నిధులు లేక నీరసపడిపోయింది. భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఇక్కడ కొత్త భవనం నిర్మించడానికి 3 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. కానీ భవన నిర్మాణం మాత్రం ఇదిగో.. అదిగో అంటున్నారే తప్ప నేటికీ ఒక కొలిక్కి రాలేదు. విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు కొనాలన్నా, పోటీపరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు కొనుగోలు చేయాలన్నా నిధులుంటే కదా? దీంతో కొత్త పుస్తకాల కొనుగోలు చేయడమన్నది గ్రంథాలయాలు మరచిపోయి చాలాకాలమైపోయింది.

## చెదలు పడుతున్న పుస్తకాలు

మరోవైపు జిల్లాలోని అనేక గ్రంథాలయాల్లో క్రమేణా పుస్తకాలు చెదలు పడుతున్నాయి. పుస్తకాలను భద్రపరిచేందుకు తగు సామగ్రి కానీ, గ్రంథాలయాలకు అవసరమైన కంప్యూటర్ల వ్యవస్థ కానీ అందుబాటులో లేవు. గ్రంథాలయాల్లో కంప్యూటర్ల ఏర్పాటుకు ఎంతో కాలంగా ప్రతిపాదనలున్నాయి. కానీ, అవన్నీ కాగితాల కవిలెకట్టల్లోనే మూలుగుతున్నాయి. ఒక్కో లైబ్రరీకి కనీసం రెండు కంప్యూటర్లన్నా అవసరం. కానీ..పట్టించుకునే వారెవరు?.. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ తదితర ఉన్నతాధికారులు ఈ దుస్థితులను గమనించి సెస్సు బకాయిలు ఇప్పించి జిల్లాలో గ్రంథాలయాలకు పునరుజ్జీవం ప్రసాదించాలని పాఠకలోకం ప్రార్థిస్తోంది.

## వాకాడు ఆర్టీసిడిపో
# రికార్డుల పరిశీలన

వాకాడులోని ఆర్టీసి డిపోను ఈ నెల 13న ఆర్టీసి నెల్లూరు జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపీనాథ్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేసి డిపోకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాకాడు డిపో సుమారు నాలుగున్నర కోట్ల రూపాయల నష్టాల్లో ఉందని, ప్రతి నెల దాదాపు 70 లక్షల దాకా నష్టం వస్తోందని అన్నారు. కార్మికులు కష్టపడి పనిచేసి డిపోను లాభాల బాటలోకి తీసుకురావాలని సూచించారు. జోన్ వర్క్‌షాప్ మేనేజర్ రవికాంత్, డిపో మేనేజర్ రమణయ్య, అసిస్టెంట్ మేనేజర్ రాము, కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా బాడీ బిల్డింగ్ పోటీలు



నెల్లూరులో జిల్లా స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు ఈనెల 15న నెల్లూరు జిల్లా అమెచ్యూర్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వతంత్ర్య పార్కులో జరిగాయి. నెల్లూరు, కోవూరు, గూడూరు, ప్రాంతాల నుండి 59 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 50,55,60,65,70,75,80 విభాగాల్లో పోటీలు జరిగాయి. ఒక్కో విభాగం నుండి ముగ్గురిని విజేతలుగా ఎంపిక చేశారు. ఓవరాల్ చాంపియన్‌గా షబ్బీర్ ఖాన్, రన్నరప్‌గా అవిజిత్ నిలిచారు. విజేతలు ఎక్కువగా హనుమాన్ జిమ్‌కు చెందినవారు. మాజీ డిప్యూటి మేయర్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ముక్కాల ద్వారకానాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, నెహ్రూ యువకేంద్రం జిల్లా యూత్ కో-ఆర్డినేటర్ మహేంద్రరెడ్డి, పి.రామకృష్ణ, జీవన్ కృష్ణ, అసోసియేషన్ మీడియా కన్వీనర్ అరవ పూర్ణ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

### సీఎం జగన్మోహన్‌రెడ్డి సాహసోపేత నిర్ణయం

# మహిళల భద్రతకు.. దిశ

మహిళల భద్రతకు పెద్దపీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన 'దిశ' చట్టం అందరి ప్రశంసలందుకుంటోంది. మహిళలపై నేరం జరిగిన 21రోజుల్లోపే కేసు నమోదు, విచారణ పూర్తిచేసి పూర్తి ఆధారాలతో నేరం ఋజువైతే శిక్షను అమలు చేసేలా తీసుకొచ్చిన చట్టంపై పక్క రాష్ట్రాల ముఖ్యమంత్రులు సైతం ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ చట్టాన్ని తీసుకొచ్చిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని అభినందిస్తున్నారు.

ఇటీవల హైదరాబాద్ శివార్లలో రింగ్‌రోడ్డు సమీపంలో 'దిశ'పై జరిగిన దారుణ సంఘటన సంచలనంగా మారడం.. ఈ కేసులోని నలుగురు నిందితులు కూడా పోలీసుల ఎన్‌కౌంటర్‌లో హతమవ్వడం తెలిసిందే!

ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్‌లోని వైసిపి ప్రభుత్వం మహిళల భద్రతపై అన్ని రాష్ట్రాలకంటే ఓ అడుగు ముందుకేసింది. మహిళలపై, చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలు, వేధింపులు, అరాచకాలకు అడ్డుకట్ట వేయాలంటే విచారణ, నేర నిరూపణ, శిక్షల అమలు అత్యంత వేగంగా జరిగిపోవాలని, అప్పుడు దుర్మార్గులలో ఒక భయం ఏర్పడుతుందని భావించింది. ఈమేరకే ఐపిసి, పోక్సో యాక్ట్, కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్స్‌కు పలు సవరణలు చేస్తూ అసెంబ్లీలో 'దిశ' చట్టాన్ని ఆమోదింపజేసింది. దీనిప్రకారం నేరం జరిగిన వారంలోగా పోలీసుల విచారణ పూర్తి కావాలి. 14రోజుల్లో కోర్టుల్లో ట్రయల్స్ పూర్తికావాలి, 21 పని దినాలలో కోర్టు ద్వారా తీర్పు రావాలి. తీర్పుపై అప్పీళ్లు, రివిజన్ పిటిషన్‌లపై విచారణను మూడు నెలల్లోగా పూర్తి చేయాలి.

## అమలు సాధ్యమేనా?

ఇప్పుడున్న చట్టాలలో, న్యాయస్థానాల ద్వారా అయితే 21రోజుల్లో కేసు విచారణ, సాక్ష్యాధారాలు సేకరించడం, తీర్పు చెప్పడం సాధ్యమయ్యే పని కాదు. కేసు విచారణలే కోర్టుల్లో నెలల తరబడి సాగుతాయి. ఢిల్లీలో జరిగిన నిర్భయ అత్యాచారం, హత్య కేసు నిందితులను పట్టుకుని ఏడేళ్లవుతున్నా ఇంతవరకు ఉరి తీయలేదు.

ఇప్పుడున్న విధానాలలో ఈ చట్టం అమలు చేయడం అసాధ్యం కాబట్టే ప్రభుత్వం మహిళలపై నేరాల కేసుల కోసం ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని, అందులో మహిళా న్యాయవాదులనే పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లుగా నియమించాలని నిర్ణయించింది. అలాగే కేసుల వేగవంత విచారణకు ప్రత్యేక పోలీసు బృందాలను నియమించనుంది.

మహిళలపై జరిగే నేరాలను ప్రత్యేక కోణంలో చూసి వాటిపై సత్వర న్యాయం చేయగలిగితేనే కొంతవరకు ఈ తరహా నేరాలను అరికట్టడానికి అవకాశముంటుంది. మహిళల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా చేయని విధంగా 'దిశ' చట్టాన్ని అమలులోకి తెచ్చిన 'జగన్'కు రాష్ట్ర మహిళలు జేజేలు పలుకుతున్నారు.

# అల్లూరు పోలేరమ్మ జాతర 31న



అల్లూరు గ్రామదేవత శ్రీ పోలేరమ్మ తల్లి జాతర ఈనెల 31న అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అల్లూరు శ్రీ పోలేరమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రంగం సిద్ధమైంది. ఆ మేరకు ఈనెల 17న తొలి చాటింపు వేశారు. శ్రీ పోలేరమ్మ గుడి వద్ద అమ్మవారికి పెద్దఎత్తున పూజలు చేసిన అనంతరం మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్దన్‌రెడ్డి సారధ్యంలో సంప్రదాయబద్ధంగా గోధూళి వేళ తొలి చాటింపు నిర్వహించారు. ఆ తర్వాత 3వ మంగళవారం రోజైన డిసెంబర్ 31న అమ్మవారి గ్రామోత్సవం జరుగుతుంది. గ్రామదేవతలైన గంగమ్మ, కలుగోళమ్మ, పోలేరమ్మ అమ్మవార్లకు పెద్దఎత్తున పూజలు చేసి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తారు. అల్లూరు (ఊరు) గ్రామ ప్రముఖులు, గ్రామస్తులందరి సహకారంతో ఈ గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుంది. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు కూడా భారీఎత్తున నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు.



## లాయర్ 2020 క్యాలెండర్ ఆవిష్కరణ

అత్యంత ఆకర్షణీయంగా చిట్టిపొట్టి చిన్నారులతో రూపొందిన 'లాయర్' 2020 క్యాలెండర్‌ను డిసెంబర్ 19 గురువారం నాడు నెల్లూరులో ఆవిష్కరించిన రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి, తిరుమల తిరుపతి దేవస్థానముల ట్రస్టుబోర్డు సభ్యురాలు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి.

# నరసింహకొండ దేవస్థానం ఛైర్మెన్‌గా ఇందుపూరు శీనయ్య



నెల్లూరురూరల్ మండలం నర సింహకొండలోని శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఛైర్మెన్‌గా పొట్టేపాలెంకు చెందిన వైసిపి నాయకుడు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డిని ప్రభుత్వం నియమించింది. అలాగే ట్రస్ట్‌బోర్డు సభ్యులుగా శ్రీమతి ఈగా రమణమ్మ, శ్రీమతి దొండకాయల శాంతమ్మ, శ్రీమతి వేమిరెడ్డి శ్వేత, శ్రీమతి ముత్తంశెట్టి లక్ష్మి, శ్రీమతి ఏకొల్లు కల్పన, పల్లవరపు వెంకటేశ్వర్లు, అమరపు వెంకటేశ్వర్లు, వాకా వెంకటేశ్వర్లులను నియమించింది. ఛైర్మెన్‌గా నియమితులైన ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి గతంలో పొట్టేపాలెం ఉపసర్పంచ్‌గా, సర్పంచ్‌గా, సొసైటీ అధ్యక్షుడిగా పనిచేసి వున్నారు.

# ప్రభుత్వ పాఠశాలలకు 'క్రియా' ఫర్నీచర్



శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో క్రియా యూనివర్సిటీ చేయూతతో శ్రీసిటీలోని మూడు ప్రభుత్వ పాఠశాలలకు ఈ నెల 14వ తేదీన డెస్కులు పంపిణీ చేశారు. విద్యార్థులు కూర్చునేందుకు అనువైన అధునాతన డెస్కులను మోపురుపల్లి ప్రాథమిక పాఠశాలకు 10, శ్రీహరికోట కాలనీ ప్రాథమిక పాఠశాలకు 6, మాదనపాలెం ప్రాథమిక పాఠశాలకు 4, మొత్తంగా లక్ష రూపాయల విలువైన 20డెస్కులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందచేశారు. శ్రీసిటీ ఫౌండేషన్ ప్రత్యేక చొరవతో సెజ్ పరిధిలోని 14 ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల పెంపుకు పలు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా గతంలో నాలుగు స్కూళ్లలో డెస్కులు పంపిణీ చేయగా, ప్రస్తుతం మరో 3 స్కూళ్లకు డెస్కులు అందచేసినట్లు శ్రీసిటీ ఫౌండేషన్ ప్రతినిధి సురేంద్ర కుమార్ తెలిపారు.

19వ తేదీ గురువారం నెల్లూరు జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలుపుతున్న వైసిపి బాపట్ల తిరుపతి లోక్‌సభ నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



## శ్రీసిటీలో పానాసోనిక్ పరిశ్రమ

జపాన్‌కు చెందిన ప్రతిష్టాత్మక ఎలక్ట్రానిక్ పరిశ్రమ పానాసోనిక్ దక్షిణభారత దేశంలో తన తొలి పరిశ్రమను శ్రీసిటీలో నెలకొల్పబోతోంది. 295కోట్ల వ్యయంతో 33ఎకరాల విస్తీర్ణంలో ఈ పరిశ్రమను నెలకొల్పబోతున్నారు. 2021కల్లా ఉత్పత్తిని ప్రారంభించే ఈ సంస్థ ద్వారా దాదాపు 600మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశాలు ఉన్నాయి. దేశంలో ఇంతవరకు పూణేలో మాత్రమే పానాసోనిక్ పరిశ్రమ వుంది.



## 'ప్రభా'తం

# బిల్లు పెట్టిన చిచ్చు...



భారత దేశంలో అక్రమంగా నివసిస్తున్న వారి సంఖ్య కోట్లలోనే వుంది. ఇలాంటి చొరబాటుదారులను తిరిగి పంపించాలన్న ఉద్దేశ్యంతోనే కేంద్ర ప్రభుత్వం ఎన్ఆర్సికి మెరుగుపెడుతోంది. దానికంటే ముందు పౌరసత్వ సవరణ బిల్లు తెచ్చింది. ఈ రెండు బిల్లులను కూడా దేశంలోని ముస్లింలు వ్యతిరేకిస్తున్నారు. పౌరసత్వ సవరణ బిల్లులో ముస్లింలను చేర్చకపోవడాన్ని పక్షపాతంగా చూపిస్తున్నారు. అదే సమయంలో ముస్లింలను వెళ్లగొట్టడానికే ఎన్ఆర్సిని తెస్తున్నారంటూ ఆందోళనలకు దిగారు. ఈ ఆందోళనలు శాంతియుతంగా వుంటే ఫర్వాలేదు. కాని, హింసాత్మకంగా మారాయి.

బ్రిటీష్‌వాడు ఈ దేశాన్ని 200 ఏళ్ళ పాటు పరిపాలించిన తర్వాత వదిలిపోతూ కూడా మరో రెండు శతాబ్దాల పాటు ఈ దేశ ప్రజలు తమనే గుర్తు చేసుకునేలా చేసిపోయాడు. వందల సంవత్సరాలు దాటినా ఆరిపోని చిచ్చును రగిల్చి వెళ్లాడు. అదే విభజన చిచ్చు. 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం ఇస్తున్నట్లు చెబుతూనే ఈ దేశాన్ని నిత్యం మండే అగ్నిగుండంలా మార్చివెళ్లాడు. స్వాతంత్ర్యంతో పాటే ఈ దేశం మత ప్రాతిపదికన విడిపోయింది. పాకిస్థాన్ ముస్లిం మత ప్రాతపదిక దేశంగా ఏర్పడగా, హిందూ మెజార్టీ అయిన భారతదేశాన్ని మాత్రం మహాత్మాగాంధీ, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూలు లౌకికవాద రాజ్యంగా మార్చారు. విభజన సమయంలో పాకిస్థాన్‌లో మత శక్తులు పేట్రేగిపోయి మెజార్టీ హిందువులను ఊచకోత కోశాయి. వేలాది మంది హిందువుల మృతదేహాలను రైళ్లలో కుక్కి భారత దేశానికి పంపించాయి. పాకిస్థాన్‌లో మతతత్వ శక్తులు సాగించినంతగా రాక్షసకాండను, ఆనాడు భారత్‌లోవున్న మెజార్టీ హిందువులు చూపించలేదు. భారత ప్రభుత్వం మూలసిద్ధాంతమైన లౌకిక భావజాలాన్ని కాపాడడానికే పెద్దపీట వేసింది. ఆ తర్వాత కాలంలో పాకిస్థాన్ నుండి బంగ్లాదేశ్ కూడా విడిపోవడం తెలిసిందే!

అయితే ముస్లింల ప్రాబల్యం అధికంగా వున్న పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్‌లలో మైనార్టీ వర్గాలైన హిందువులు, సిక్కులు, క్రైస్తవులు, బౌద్ధుల పరిస్థితి దయనీయంగా మారింది. వారిపై మతపరమైన దాడులు, వేధింపులు ఎక్కువయ్యాయి. ఆ దేశాలలో మైనార్టీలు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన పరిస్థితి. స్వాతంత్ర్యానంతరం ఆ దేశాలలో 15 నుండి 20 శాతంగా వున్న హిందువులు, సిక్కులు, బౌద్ధులు ఇప్పుడు రెండు, మూడు శాతాల మధ్యనే వున్నారంటే మైనార్టీలపై ఆ దేశాలలో ఎంత వివక్ష చూపుతున్నారో అర్థం చేసుకోవచ్చు. అదే సమయంలో భారత్‌లో అప్పుడు 5 నుండి 10శాతం మధ్య వున్న మైనార్టీలు ఈరోజు 30శాతం వరకు పెరిగారంటే ఇక్కడ మైనార్టీల భద్రతకు ఎంతటి ప్రాధాన్యత వుందో తెలుసుకోవచ్చు.

ప్రపంచంలో వందకుపైగా క్రైస్తవ మత ఆధిపత్య దేశాలున్నాయి. 40 దాకా ఇస్లాం దేశాలున్నాయి. ఆరువరకు బౌద్ధ మత ప్రాధాన్యత దేశాలున్నాయి. కాని వందకోట్లకుపైగా జనాభా వున్న హిందువులకు పెద్దదిక్కుగా వున్న దేశం భారత దేశమే! నేపాల్ హిందూమత ఆధిపత్య దేశమైనప్పటికీ భారతదేశ మంతటి శక్తివంతమైన దేశం కాదు. కాబట్టి ఇస్లాం ఛాందస మత దేశాలలో భయం భయంగా బ్రతుకుతున్న మైనార్టీలను అక్కున చేర్చుకునే అవకాశముండేది భారత్‌కే! అందుకే కేంద్రంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం పౌరసత్వ సవరణ బిల్లును తెచ్చి పార్లమెంటు ఉభయ సభలలో ఆమోదం పొందేలా చేసింది. దీని తర్వాత త్వరలో ఎన్ఆర్‌సి బిల్లును కూడా పార్లమెంటులో ప్రవేశపెట్టబోతోంది.

పౌరసత్వ సవరణ బిల్లు ద్వారా పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ దేశాలలో వుండే హిందు, బౌద్ధ, క్రైస్తవ, జైనులు, సిక్కు మతస్థులకు శరణార్ధులుగా వస్తే భారతీయ పౌరసత్వం లభిస్తుంది. అదే సమయంలో జాతీయ పౌరసత్వ విధానం(ఎన్ఆర్‌సి) బిల్లు ఆమోదం పొందితే ఈ దేశంలో అక్రమంగా నివాసముంటున్న వారిని వెళ్లగొట్టడానికి అవకాశముంటుంది. బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్, మయన్మార్, శ్రీలంక దేశాల నుండి వలసవచ్చి ఈ దేశంలో అక్రమంగా నివసిస్తున్న వారి సంఖ్య కోట్లలోనే వుంది. ముఖ్యంగా పశ్చిమబెంగాల్, ఈశాన్య రాష్ట్రాలలో అక్రమ వలసదారులు ఎక్కువుగా వుంటున్నారు. అస్సాంలో ఇప్పటికే ఎన్ఆర్‌సిని అమలు చేశారు. దీనిని దేశవ్యాప్తంగా అమలు చేసి, చొరబాటుదారులను తిరిగి పంపించాలన్నది కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యం. అందుకే ఎన్ఆర్‌సికి మెరుగుపెడుతోంది. దానికంటే ముందు పౌరసత్వ సవరణ బిల్లు తెచ్చింది.

ఈ రెండు బిల్లులను కూడా దేశంలోని ముస్లింలు వ్యతిరేకిస్తున్నారు. పౌరసత్వ సవరణ బిల్లులో ముస్లింలను చేర్చకపోవడాన్ని పక్షపాతంగా చూపిస్తున్నారు. అదే సమయంలో ముస్లింలను వెళ్లగొట్టడానికే ఎన్ఆర్‌సిని తెస్తున్నారంటూ ఆందోళనలకు దిగారు. ముస్లిం వర్గాల ఆందోళనలకు కాంగ్రెస్‌తో పాటు పలు ప్రాంతీయ పార్టీలు మద్దతు పలికాయి. పశ్చిమబెంగాల్, కేరళ రాష్ట్రాలలో అయితే ముఖ్యమంత్రులే ఆందోళనలకు నేతృత్వం వహిస్తున్నారు.

ఈ ఆందోళనలు శాంతియుతంగా వుంటే ఫర్వాలేదు. కాని, హింసాత్మకంగా మారాయి. పశ్చిమ బెంగాల్‌తో సహా పలు రాష్ట్రాలలో ప్రభుత్వ ఆస్తులను దహనం చేయడం, ధ్వంసం చేయడం చేస్తున్నారు. పలు రాజకీయ పక్షాలు హింసాత్మక ఆందోళనలను ఎగదోసే పనిలో వున్నాయి.

ఈ బిల్లులపై ఎవరి అభిప్రాయాలు వారికున్నాయి. పౌరసత్వ సవరణ బిల్లులో ముస్లింలను చేర్చకపోవడానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే వివరణ ఏంటంటే... ముస్లిం దేశాలలో ముస్లింలు వివక్షకు గురయ్యే అవకాశం వుండదు కాబట్టి వాళ్లనెందుకు చేర్చాలని... అలాగే అక్రమ చొరబాటుదారులకు భారత్‌ను ఎందుకు ఆశ్రయంగా మలచాలని... ఆందోళనలు చేస్తున్న ముస్లింల భయం ఏమంటే... ఈ బిల్లుల ద్వారా తమ భద్రత ప్రమాదంలో పడుతుందని... రాజకీయ ప్రాధాన్యత తగ్గిపోతుందని. ఈశాన్య రాష్ట్రాల ప్రజల భయం ఏంటంటే... తమ రాష్ట్రాలలోకే ఈ బిల్లు ద్వారా పౌరులు ఎక్కువుగా వస్తారని... తమ ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని.

ఈ బిల్లులు అమలైనంతమాత్రాన ఇప్పటికప్పుడు అన్నీ జరిగిపోవు. అలాగే బిల్లుల్లో ఆందోళన కలిగించే అంశాలుంటే వాటిని సవరించే దిశగా కేంద్రం చొరవ చూపాలి. ముందు హింసాత్మక ఆందోళనలను నిలువరించే ప్రయత్నం జరగాలి.

## అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



నెల్లూరు నగరంలోని వేదాయపాళెంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో ఈనెల 13న స్వామివారికి ఎంతో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శతకలశాభిషేకం, నవకాభిషేకం తదితర విశిష్ట పూజలతో స్వామివారిని సేవించారు. మండల పూజోత్సవాలను పురస్కరించుకుని ఆలయ అర్చకుడు నంబూద్రిపాద్ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. ఈ కార్యక్రమాలకు దేవళ్ళ శ్రీధర్‌రెడ్డి, సుప్రజ, దేవళ్ళ శ్రీనివాసులురెడ్డి, నిర్మల దంపతులు, వారి కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యవహించారు. అయ్యప్ప సేవాసమాజం అధ్యక్ష కార్యదర్శులు రంగరాజన్, శేషగిరిరావు, కోశాధికారి విజయకుమార్, సభ్యులు పాల్గొని పర్యవేక్షించారు.

## ముందస్తు క్రిస్మస్ సందడి

- అందరినీ ఆకట్టుకున్న యునైటెడ్ క్యారల్స్
- అలరించిన భక్తిగీతాలు

మెర్రీ క్రిస్మస్..హ్యాపీ క్రిస్మస్ అంటూ సంతోషసంరంభాలతో, మధురమైన గానాలతో సింహపురి యునైటెడ్ క్యారల్స్ బృందం నెల్లూరు నగరాన్ని క్రిస్మస్ సందడితో హోరెత్తించింది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గాయకులు గానం చేసిన క్రిస్మస్ గీతాలు అందరినీ బాగా ఆకట్టుకున్నాయి. సింహపురి అసోసియేట్స్ ఇన్ క్రైస్ట్ ఆధ్వర్యంలో అయిదవసారి నిర్వహించిన క్యారల్స్ ర్యాలీని నగరంలోని ఏబిఎం కాంపౌండ్ వద్ద జిల్లా కలెక్టర్ ఎం.వి శేషగిరిబాబు క్రిస్మస్ క్యాండిల్స్‌ను వెలిగించి ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యేసుక్రీస్తు శాంతి బోధనలు ప్రపంచానికి అవసరమని, ఆయన ప్రేమతత్వాన్ని అందరూ అలవరచుకోవాలని కోరారు. ఫాదర్ రెవరెండ్ జోసఫ్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో వినూత్నంగా నగరంలోని అన్ని క్రైస్తవసంఘాలు కలిసి యునైటెడ్ క్యారల్స్‌ను నిర్వహించడం ఎంతో విశేషమన్నారు. విశ్రాంత న్యాయమూర్తి రమణీ కృపావతి, కస్టమ్స్ సూపరింటెండెంట్ ఉషాకిరణ్ క్రీస్తు జనన సందేశాన్ని వివరించి నగరవాసులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఏసి సెంటర్ వద్ద వైఎస్సార్‌పి నాయకుడు, మాజీ కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి నగరవాసులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. గాంధీబొమ్మ వద్ద మాజీ డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్, విఆర్‌సి కూడలి వద్ద డాక్టర్ శివప్రసాద్, బాప్టిస్ట్ చర్చ్ డానీహాల్ చీఫ్ పాస్టర్ రెవరెండ్ మనోహర్, కార్యదర్శి ప్రభాకర్‌రావు, కోశాధికారి జయకుమార్‌లు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. సింహపురి అసోసియేషన్ ఇన్ క్రైస్ట్ ఛైర్మెన్ అరుణ్‌కుమార్, క్వైర్ డైరెక్టర్ బిల్లీశ్యామ్సన్, సంధ్యా శ్యామ్సన్ సారధ్యంలో భక్తిగీతాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్సీపి నాయకుడు వేలూరు మహేష్, మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్, క్యారల్స్ కో-కన్వీనర్లు విద్యాధర్, విజయకుమార్ (శాంతాక్లాజ్), సురేష్‌బాబు, మహేష్, సందీప్, మోజీ, హిమాంష్ పాల్గొన్నారు. కన్వీనర్లు రెవరెండ్ డేవిడ్ దయాసాగర్, బ్రదర్ జానీజో, ఆన్‌లైన్ కన్వీనర్ సతీష్ ముద్దా తదితరులు పర్యవేక్షించారు.

## జననేతకు కృతజ్ఞతలు

మహిళలపై అత్యాచారాలు, వేధింపులను అరికట్టడానికి, నిందితులకు 21రోజుల్లోనే శిక్షను అమలు పరిచేలా 'దిశ' చట్టం తీసుకొచ్చిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి మహిళల తరపున కృతజ్ఞతలు. దేశానికే తలమానికంగా వుండేలా ఈ చట్టాన్ని తీసుకొచ్చారు. అయితే చట్టం తేవడంలోనే కాదు, నేర విచారణ, శిక్షల అమలు ఆచరణలోకి రావాలి. ఈ చట్టం సమర్ధవంతంగా పనిచేస్తుందనే ధైర్యం రావాలి. న్యాయ, పోలీసు వ్యవస్థలు సంపూర్ణంగా సహకరిస్తేనే ఈ చట్టం సవ్యంగా అమలవుతుంది. ఢిల్లీలో నిర్భయ ఉదంతం తర్వాత కేంద్రం నిర్భయ చట్టాన్ని తెచ్చింది. అయినా కూడా దేశంలో అత్యాచారాలు ఆగలేదు. చట్టాలు చేయడం కాదు, వాటిని ఖచ్చితంగా అమలు చేయాలి.

**ఎస్.బృందావని, హైదరాబాద్.**

## హుందాగా వ్యవహరించాలి

ఏపి అసెంబ్లీ సమావేశాలలో కొందరు సభ్యులు వ్యవహరిస్తున్న తీరు హుందాగా లేదు. చంద్రబాబును అవమానకరంగా తిట్టడమే పనిగా పెట్టుకుంటున్నారు. ఆయన మాట్లాడేటప్పుడు మైక్‌ను కట్ చేస్తున్నారు. చంద్రబాబు గత ఐదేళ్ల తన పాలనాకాలంలో అసెంబ్లీలో ఒక దుష్టసాంప్రదాయాన్ని నెలకొల్పాడు. సభకు వున్న విలువలు మరచి, దానినొక మార్కెట్‌గా చేశాడు. చంద్రబాబు ఆరోజు అలా చేశాడని చెప్పి వైసిపి వాళ్ళు కూడా ఈరోజు అదే విధంగా వ్యవహరించడం సబబు కాదు. ఆయన గడ్డితిన్నాడని మీరూ గడ్డి తినాలా? ఆయనకు మీకు వున్న తేడాను చూపండి. ముఖ్యంగా చంద్రబాబు రాజకీయ అనుభవాన్ని చూడకపోయినా ఆయన వయసుకు గౌరవమివ్వండి. హేళన చేయడం మానండి.

**కాసారం నాగేశ్వరరావు, నెల్లూరు.**

## హిందువులెక్కడికిపోతారు





ప్రపంచంలో హిందువులకు వున్న ఏకైక దేశం భారతదేశం. పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ వంటి దేశాలలో హిందువులపై ఎలాంటి అరాచకాలు జరుగుతున్నాయో చూస్తూనేవున్నాం. అలాంటి వారికి ఆశ్రయం ఇవ్వాల్సిన బాధ్యత మనపైనే వుంది. బంగ్లాదేశ్, మయన్మార్‌ల నుండి వలసవచ్చే రోహింగ్యాలకు మనం ఆశ్రయం ఇవ్వాల్సిన అవసరం లేదు. వాళ్ళు పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘానిస్థాన్‌లకు పోయి వుండొచ్చు. అదీగాక మయన్మార్ దేశంలో హిందువులు, బౌద్ధులపై రోహింగ్యాలు ఎన్నో అరాచకాలు చేశారు. సామూహిక హత్యాకాండ గావించారు. అలాంటి వాళ్ళను దేశంలో పెట్టుకుంటే పెద్ద ప్రమాదమే! మన దేశంలోని నేతలే ఓట్ల రాజకీయాల కోసం అటువంటి వారికి ఆశ్రయం కల్పిస్తున్నారు. ఇకనైనా వారు దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుంటే మంచిది.

**సి.రాజీవి, నెల్లూరు.**

## ఉదయగిరి జిల్లా...

# ఆచరణ సాధ్యమేనా?



నెల్లూరుజిల్లాలో ఇందుకూరుపేట, అల్లూరు, విడవలూరు, ముత్తుకూరు వంటి తూర్పువైపు ప్రాంతాలకు వెళితే ఒక విధమైన వాతావరణం కనిపిస్తుంది. పచ్చటి పైర్లు, నిటారుగా పెరిగిన కొబ్బరిచెట్లు, రొయ్యలు, చేపల చెరువులు, గ్రామాలలో అందమైన భవనాలు, రయ్ రయ్ మని తిరిగే కార్లు... ఇక్కడ ప్రజల జీవన విధానం చాలా మెరుగ్గా, ఆధునికంగా వుంటుంది.

ఇదే జిల్లాలో కొండ క్రింద మండలాలు సీతారాంపురం, ఉదయగిరి, మర్రిపాడు, వింజమూరు, కొండాపురం, వరికుంటపాడు మండలాలలోని గ్రామాలను చూస్తే బీడుపొలాలు, ఎండిన చెరువులు, మొండి గోడల ఇళ్ళు, రచ్చబండల మీద పనిలేకుండా ఖాళీగా వున్న జనాలు కనిపిస్తారు. తూర్పువైపు కోస్తా ప్రాంతాలలో ఎకరా భూమి 30 లక్షల నుండి కోటి రూపాయల దాకా పలుకుతోంది. అదే పడమర పల్లెల్లో మాత్రం ఎకరా భూమి 30వేల నుండి మంచిరేటు అంటే అయిదారు లక్షల దాకా పలుకుతోంది. తూర్పు పల్లెల్లో ఎకరా వున్నా ఒకటే, పడమర పల్లెల్లో పాతిక ఎకరాలు వున్నా ఒకటే అన్నట్లుగా లెక్కుంది.

సాగునీళ్ళు లేక తాగునీళ్ళు లేక, పైర్లు పండక, పరిశ్రమలు రాక ఉపాధి అవకాశాలు లేక ఉదయగిరి ప్రాంతం నుండి ప్రతియేటా ఉపాధి కోసం వలసపోతున్న వారి సంఖ్య వేలల్లోనే వుంటోంది. ఈ పరిస్థితులలో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాలంటే ఉదయగిరిని జిల్లాగా మార్చాలంటూ ఈమధ్య కొందరు ఉద్యమం మొదలుపెట్టారు. జిల్లాగా ప్రకటించగానే ఉదయగిరి అభివృద్ధి చెందుతుందా? అన్నది ఇక్కడ మొదటి ప్రశ్న! ఉదయగిరిని ఇప్పటికిప్పుడు జిల్లా కేంద్రంగా ప్రకటించినా కూడా ఇక్కడ పనిచేసే ఉన్నతాధికారులు సాయంత్రమైతే నెల్లూరుకు పోతుంటారు. ఎందుకంటే ఇక్కడ స్థిర నివాసాలుండే పరిస్థితి వుండదు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి లోక్‌సభ నియోజకవర్గ కేంద్రాన్ని జిల్లాగా ఏర్పాటు చేసే దిశగా కసరత్తు మొదలుపెట్టింది. ఈ లెక్కన రాష్ట్రంలో పాతిక జిల్లాలు ఏర్పడతాయి. వాటిలో ఉదయగిరికి ఛాన్స్ వుండదు. తెలంగాణలో కేసీఆర్ 36 జిల్లాలను ఏర్పాటు చేసినట్లు రాష్ట్రంలో జగన్ కూడా ఓ 50 జిల్లాలను ఏర్పాటు చేస్తే అప్పుడు ఉదయగిరికి అవకాశం ఉంటుందేమో!?

జిల్లా కేంద్రంగా కంటే కూడా ముందుగా ఉదయగిరిని అభివృద్ధికి కేంద్రంగా, ఉపాధి అవకాశాలకు స్థావరంగా, నీళ్ళ కొరత లేని ప్రాంతంగా మార్చుకోవాలి. పార్లమెంటు సభ్యులు, మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే సహకారంతో ఉదయగిరిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పరచాలి. జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు పి.అనిల్‌కుమార్‌యాదవ్, మేకపాటి గౌతమ్‌రెడ్డిల సహకారం ఉదయగిరి ప్రాంత అభివృద్ధికి కీలకం. మంత్రి అనిల్ సహకారంతో సోమశిల హైలెవల్ కెనాల్, వెలుగొండ ప్రాజెక్టులను పూర్తి చేసుకోవాలి. సాగునీటి, తాగునీటి వసతులు పెంచుకోవాలి. పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతంరెడ్డి సహకరిస్తే ఈ ప్రాంతం కొంతవరకు పారిశ్రామికంగానూ అభివృద్ధి చెందే అవకాశం వుంది. ఉదయగిరి జిల్లా కోసం ఉద్యమిస్తున్న వాళ్ళు ముందుగా ప్రజాప్రతినిధుల ద్వారా వీటిని సాధించే ప్రయత్నం చేయాల్సివుంది.

## పట్టణ ఎలక్షన్.. కీలకంగా మారనున్న



# అభ్యర్థుల సెలక్షన్

**ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మున్సిపల్ ఎన్నికలు వచ్చే ఫిబ్రవరిలో వుంటాయని మున్సిపల్ మంత్రి బొత్స సత్యనారాయణ సెలవిచ్చాడు.**

అసలు ఈ ఎన్నికలను ఇంతకాలం వాయిదా వేయడం కూడా అనవసరం. అసెంబ్లీ ఎన్నికలు ముగిసి వైసిపి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మరుసటి నెలలోనే పెట్టేసివుంటే, స్థానిక సంస్థలకు కూడా పాలకవర్గాలు ఏర్పడిపోయి వాటి పాలన కూడా సాఫీగా సాగిపోతుండేది. ఎన్నికలు కూడా ఏకపక్షంగా జరిగిపోయి వుండేవి. అభ్యర్థులకు పెద్దగా డబ్బు ఖర్చు వుండేది కాదు. కనీసం ఇప్పుడు ఫిబ్రవరిలోనన్నా మున్సిపల్ ఎన్నికలను ముగించక తప్పదు.

జిల్లాలో నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు గూడూరు, కావలి, వెంకటగిరి, సూళ్ళూరుపేట, ఆత్మకూరు మున్సిపాల్టీలు, నాయుడుపేట నగర పంచాయితీకి ఎన్నికలుంటాయి. ఈలోపు జిల్లాలో ఇంకొన్ని మేజర్ పంచాయితీలను నగర పంచాయితీలుగా మార్చే అవకాశం కూడా వుంది. అది కూడా జరిగితే వాటికి కూడా పార్టీ గుర్తుల మీదే ఎన్నికలుంటాయి.

ఈ మున్సిపల్ ఎన్నికలను గెలవడం ఎమ్మెల్యేలకు ప్రతిష్టాత్మకం. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలే అయ్యింది. ఎన్నో పథకాలతో ప్రభుత్వం ప్రజల్లోకి దూసుకుపోయింది. ఒకటీ అరా విషయాలలో తప్పితే ప్రభుత్వంపై పెద్దగా వ్యతిరేకత లేదు. కాబట్టి మున్సిపాల్టీలను గెలవడం ఎమ్మెల్యేలకు పెద్ద సమస్య కాకపోవచ్చు.

వైసిపి ఎమ్మెల్యేలకు అసలు సమస్య ఎక్కడొస్తుందంటే మేయర్, ఛైర్‌పర్సన్, కార్పొరేటర్, కౌన్సిలర్ అభ్యర్థుల ఎంపిక వద్దే! వైసిపి టిక్కెట్లకు ఈసారి పోటీ ఎక్కువగా వుంటుంది. పార్టీ కోసం తొమ్మిదేళ్ళ నుండి కష్టపడుతున్న వారితో పాటు కొత్తగా పార్టీలోకి వచ్చిన వాళ్ళు కూడా వున్నారు. పార్టీ సీటు తెచ్చుకుంటే సులభంగా గెలిచిపోయి కార్పొరేటర్, కౌన్సిలర్లం అయిపోతామనే ధీమా వుంది. కాబట్టి గెలుపు కంటే కూడా అభ్యర్థుల ఎంపిక ఎమ్మెల్యేలకు పెద్ద టెన్షన్ అవుతుంది.

# వండర్... రివర్స్ టెండర్

## • సోమశిల హైలెవల్ పనుల్లో 67.9 కోట్ల ఆదా!



***రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమలు చేస్తున్న రివర్స్ టెండరింగ్ విధానం సత్ఫలితాలను సాధిస్తోంది. సీఎం జగన్ అంచనాలకు అనుగుణంగా ప్రభుత్వానికి ఆదాయాన్ని మిగిలిస్తుంది. పోలవరం ప్రాజెక్ట్‌కు రివర్స్ టెండర్‌తో మొదలుపెట్టిన ప్రక్రియ విజయవంతంగా ముందుకు సాగుతోంది. ఈ పరంపరలోనే నెల్లూరుజిల్లాలో మెట్టప్రాంతమైన ఉదయగిరి ప్రాంతానికి సోమశిల నుండి సాగునీళ్ళు, తాగునీళ్ళు అందించే లక్ష్యంతో మంజూరు చేసిన సోమశిల హైలెవల్ కెనాల్ రెండోదశ పనులకు నిర్వహించిన రివర్స్ టెండర్ కూడా సక్సెస్ అయ్యింది.***

గత తెలుగుదేశం ప్రభుత్వం చివరి రోజుల్లో సోమశిల హైలెవల్ కెనాల్ రెండోదశ పనులకు 503.37 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు నిర్వహించగా అప్పుడు 4.79 శాతం అధికధర(527.53కోట్లు)తో ఆ కాంట్రాక్ట్‌ను సీఎం రమేష్ కంపెనీకి అప్పగించారు.

వైసిపి అధికారంలోకి రాగానే రద్దు చేసిన పనుల్లో సోమశిల హైలెవల్ కెనాల్ కూడా చేరింది. పాత అంచనా వ్యయం 503.37కోట్లతోనే మళ్ళీ టెండర్లను ఆహ్వానించింది. ఈ పని కోసం రాఘవ కన్‌స్ట్రక్షన్స్, బివిఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్, ఏపిఆర్ కన్‌స్ట్రక్షన్స్‌లు బిడ్‌లు దాఖలు చేశాయి. బిడ్‌ల దశలోనే 2.5శాతం తక్కువకు కోట్ చేయడంతో అక్కడే 12.58 కోట్లు మిగిలినట్లయ్యింది. తర్వాత బిడ్‌లో వచ్చిన 2.5శాతం తక్కువ విలువ 490.97కోట్లనే కాంట్రాక్ట్ విలువగా నిర్ణయించి మూడు సంస్థల మధ్య ఈ–ఆక్షన్ నిర్వహించారు. ఇందులో మూడు సంస్థలు కూడా పోటాపోటీగా పాల్గొన్నప్పటికీ సరిగ్గా గడువు ముగిసే సమయానికి 8.69 శాతం లెస్‌తో బివిఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ కాంట్రాక్ట్‌ను దక్కించుకుంది. దీంతో ప్రభుత్వానికి 67.9కోట్లు మిగిలినట్లయ్యింది.

ఇప్పటికే ఆల్తూరుపాడు లిఫ్ట్‌కెనాల్ రివర్స్ టెండర్ ద్వారా 67.81కోట్లు ఆదా కావడం తెలిసిందే! గత తెలుగుదేశం ప్రభుత్వంలోనే దీనికి కూడా ఎక్సెస్ అంచనాలతో టెండర్ జరిగింది. జిల్లాలో ఈ రెండు పెద్ద పనులకు రివర్స్ టెండర్ ద్వారా ప్రభుత్వం ఆశించిన ఫలితాలు వచ్చినట్లైంది.

# ఒకే ఒరలో రెండు కత్తులు

**రాజకీయాలలో ఎన్నెన్నో చిత్రాలు, విచిత్రాలు చూస్తుంటాం. ఎప్పుడు ఎవరెవరు స్నేహితులుగా వుంటారో, ఎవరెవరు శత్రువులుగా మారుతారో అర్థం కాదు. కావలి నియోజకవర్గ రాజకీయాలలో ఇప్పుడు మనం అలాంటి సన్నివేశాలనే చూస్తున్నాం.**

కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి.. పక్కా కాంగ్రెస్ నాయకుడు. వైయస్ కుటుంబానికి ఆప్తుడు. మూడు దశాబ్దాలకుపైగా కాంగ్రెస్, దాని తర్వాత వైసిపిలో కొనసాగాడు. వైయస్ కుటుంబంతో తప్పితే మరో చోట ఆయన్ను ఊహించుకోలేము. అలాంటి నాయకుడు నిన్నటి ఎన్నికల్లో అనవసర పంతాలకుపోయి వైసిపిని వదిలేసి తెలుగుదేశంలోకి వెళ్లాడు. ఆ పార్టీ తరపున కావలి నుండి పోటీ చేసి ఓడిపోయాడు. అదే వైసిపిలో కొనసాగి వుంటే ఆయనకు మంచి హోదా, గౌరవం వుండేది.

అదే సమయంలో ముప్ఫైఏళ్ళుగా తెలుగుదేశంపార్టీతో అనుబంధమున్న బీద మస్తాన్‌రావు ఆ పార్టీని వదిలి వైసిపిలో చేరాడు. వైసిపిలో విష్ణువర్ధన్ రెడ్డికి వుండాల్సిన స్థానాన్ని, గౌరవాన్ని ఆయన సొంతం చేసుకున్నాడు.

ఇక సిట్టింగ్ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, బీద మస్తాన్‌రావులు నిన్నటివరకు ప్రత్యర్థులే! 2009, 2014 ఎన్నికల్లో ఒకరిపై ఒకరు పోటీ చేసుకున్న వాళ్ళే! కాని, ఇప్పుడు ఇద్దరూ ఒకే గూటికి చేరారు.



## స్నేహాలు మారాయి వర్గాలు కలిశాయి



సాధారణంగా ఒక నియోజకవర్గ స్థాయి నాయకుడు కొత్తగా పార్టీలో చేరినప్పుడు వర్గ పోరుకు అవకాశముంటుంది. అయితే బీద మస్తాన్‌రావు చేరిక వల్ల రామిరెడ్డి ప్రతాప్‌కు అలాంటి తలనొప్పి ఏమీ వుండకపోవచ్చు. ఎందుకంటే ఇద్దరు కూడా వ్యాపారస్థులు, వర్గాలను కట్టి రాజకీయాలు చేసేంత ఉత్సాహం వుండే వాళ్ళు కాదు. రామిరెడ్డి ప్రతాప్ ఎమ్మెల్యేగిరికి బీఎంఆర్ అడ్డం కాదు. ఆయన రాజ్యసభ, ఎమ్మెల్సీ వంటి వాటి ట్రాక్‌లో వెళతాడు. నియోజకవర్గంలో కూర్చుని అదిపనిగా అందరినీ కలబెట్టే రకం కూడా కాదు. కాబట్టి కావలి రాజకీయ ఒరలో ఈ రెండు కత్తులు కుదురుగానే ఇమిడిపోవచ్చు. వైసిపిలోకి బిఎంఆర్ రావడం పార్టీకి కూడా బలమే అవుతుంది. తెలుగుదేశం వైపు నుండి వీరిని ధీటుగా ఎదుర్కొనే నాయకత్వం కూడా ఇప్పుడు లేదు. కాబట్టి బీదా మస్తాన్‌రావు చేరికవల్ల పార్టీకి మేలేగాని నష్టం లేదు!




# బాగుపడనున్న కాలువ కట్ట

నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ నుండి ఆనం వెంకటరెడ్డి బొమ్మ వరకు సర్వేపల్లి కాలువకట్టకు పడమరవైపున ఆక్రమణలను ఇరిగేషన్ అధికారులు తొలగించారు. ఈ కట్ట మినీబైపాస్‌ను ఆనుకునే వుండడంతో ఆక్రమణదారులకు ఈ స్థలాలపైనే కన్నుంది. అప్పటికీ ఈ స్థలాన్ని ఆక్రమించి విజయ మహల్ గేటు - ఆత్మకూరు బస్టాండ్‌ల మధ్య మందిరాలు, వ్యాపార సంస్థలు, పార్టీ కార్యాలయాలు కట్టి వున్నారు. వీటిని తొలగించడం పెద్ద సమస్య కానుంది. మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్ ఆదేశాలతో ఇరిగేషన్ అధికారులు కొన్ని ఆక్రమణలను తొలగించారు. తొలగించిన ప్రాంతాన్ని అందంగా తయారు చేయనున్నారు. దీని కోసం ప్రత్యేకంగా నిధులు కూడా మంజూరు చేశారు.

### రివర్స్ టెండర్‌లో

# అవినీతి సంస్థలకు పనులా?

**- ఆనం వెంకటరమణారెడ్డి**




వైకాపా ప్రభుత్వం మలిదేవి డ్రెయిన్ కు రూ.73 కోట్లు, ఆల్తూరుపాడు రిజర్వాయర్ కు రూ.250 కోట్లు అంచనాలతో రివర్స్ టెండర్ల ద్వారా అవినీతికి పాల్పడిన ఆర్‌కె కన్‌స్ట్రక్షన్స్, బీవీయస్‌ఆర్ సంస్థలకు పనులు అప్పగించారని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి విమర్శించారు. ఈనెల 14న నెల్లూరు ఎన్టీఆర్ భవన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అవినీతికి పాల్పడి విచారణ ఎదుర్కొంటున్న కాంట్రాక్టర్లకు ఇరిగేషన్ శాఖ పరిధిలోని మలిదేవి డ్రైయిన్, ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులను అప్పగిస్తే ఆ పనుల్లో అవినీతికి పాల్పడినట్లు విజిలెన్స్ విచారణలో స్పష్టమైందన్నారు. జనవరి నెలలో రెండు సంస్థల యాజమాన్యాలను క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేయాలని విజిలెన్స్ ఆదేశించిందని, ఎన్నికల కోడ్ కారణంగా టీడీపీ ప్రభుత్వానికి ప్రాసిక్యూషన్ చేసే అవకాశం రాలేదన్నారు. ఈ క్రమంలో వైకాపా ప్రభుత్వంలో ఆయా సంస్థలకు పనులు అప్పగించారని మండిపడ్డారు. ఆ రెండు సంస్థలు మినహా మిగిలిన వారిని బెదిరించి బిడ్లు దాఖలు చేయకుండా చేశారని ఆరోపించారు. ఈ వ్యవహా రంలో జలవనరులశాఖామంత్రి అనిల్‌కుమార్ యాదవ్ హస్తం ఉందన్నారు. వెంటనే టెండర్లు రద్దు చేయాలని లేకుంటే హైకోర్టుకు వెళతామని హెచ్చరించారు. టీడీపీ నాయకులు సికిందర్‌రెడ్డి, ఆసిఫ్ బాషా, శీను, రవి, రమేష్ నాయుడు, మల్లి పాల్గొన్నారు.

# ధనుర్మాసం మొదలైంది

వైష్ణవ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైన ధనుర్మాసం ఈ నెల 17వ తేదీ నుండి మొదలైంది. జనవరి 15వ తేదీన సంక్రాంతి పండుగతో ఈ మాసం ముగుస్తుంది. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని నగరంలోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలోనూ, శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలోనూ, మాగుంట లేఅవుట్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలోనూ ప్రతిరోజూ ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్నారు. తెల్లారుజామునే భక్తులు లేచి దేవాలయాలకు వెళ్లి పూజల్లో పాల్గొంటున్నారు. ఈ మాసమంతా కూడా ఇళ్ల ముందు ముగ్గులతో, గుళ్ల ముందు భక్తులతో కళకళగా వుంటుంది.

## నెల్లూరు కబుర్లు

# సిఇసి ప్రశంసలందుకున్న కలెక్టర్



జిల్లా కలెక్టర్ ఎం.వి. శేషగిరిబాబు భారత ఎన్నికల సంఘం అభినందనలందుకున్నారు. 16వ తేదీన ఢిల్లీలో ఈవిఎంల నిర్వహణ, రానున్న ఎన్నికల్లో ఈవిఎంల పాత్ర, వాటిపై పూర్తి అవగాహన వంటి అంశాలపై కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహించిన సమావేశానికి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సమావేశంలో ఈవిఎంల నిర్వహణపై కలెక్టర్ ఇచ్చిన ప్రజంటేషన్‌ను ఎన్నికల సంఘం మెచ్చుకుంది.

# 22న విజయకు అభినందన సభ



జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టిన ఆనం విజయకుమార్‌రెడ్డి అభినందన సభ ఈనెల 22వ తేదీ ఉదయం 10గంటలకు నెల్లూరులోని బ్యాంక్ ప్రాంగణంలో జరుగనుంది. జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు పి.అనిల్‌కుమార్‌యాదవ్, మేకపాటి గౌతమ్‌రెడ్డిలతో పాటు పార్లమెంటుసభ్యులు, జిల్లాలోని శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు, వైసిపి నాయకులు పెద్ద సంఖ్యలో ఈ సభకు హాజరుకానున్నారు.

### ఏకగ్రీవంగా పంచాయితీరాజ్

# ఉద్యోగ సంఘం ఎన్నిక



పెంచలయ్య, అధ్యక్షుడు

జిల్లాలోని 46 మండలాల పంచాయితీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ యూనియన్ ఉద్యోగుల సంఘం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. సంఘంకు అధ్యక్షులుగా లక్కాకుల పెంచలయ్య, ప్రధాన కార్యదర్శిగా బి.రమేష్‌బాబు, కోశాధికారిగా పి.రజనీకాంత్, అసోసియేట్ అధ్యక్షులుగా ఎస్‌కె కరీముల్లా, ఉపాధ్యక్షులుగా వి.నాగరాజు, ఉపకార్యదర్శిగా ఎ.అనిల్‌కుమార్, కార్య నిర్వాహక కార్యదర్శులుగా జి.శ్రీధర్‌మోహన్, సి.రామకృష్ణ, సయ్యద్ రంతుల్లా, ఇ.ఆనంద్ బాబు, కె.సురేష్‌బాబు, జేసీసీ మెంబర్‌గా ఎన్‌డి ఖాజానయాబ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా దేవప్రసన్న, ఎస్.వెంకట కృష్ణయ్య, డి.వి.నాగరాజు, ఎం.ఇమ్మానుయేల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### పేద బ్రాహ్మణ విద్యార్థులకు

# ప్రోత్సాహకాలు

పేద బ్రాహ్మణ ఉన్నత విద్యా సహాయక సంస్థ వారి 2019 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రోత్సాహకాల కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. డిగ్రీ మొదటి, రెండవ సంవత్సరములు, ఇంజినీరింగ్ మొదటి,రెండు,మూడవ సంవత్సరములు చదివే విద్యార్థిని, విద్యార్థులు ఈనెల 22వ తేదీలోగా తమ దరఖాస్తులను సంస్థ ఉపాధ్యక్షులు ఎంవి చలం, ఆంధ్రా బ్యాంకు ఎదురుగా, బృందావనం, నెల్లూరు చిరునామాలో అందజేయాలని కోరారు. ఇతర వివరాల కొరకు యస్‌వియల్ వరప్రసాద్ 9885199663, వై.నాగదేవిప్రసాద్ 9440164423 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

# మంత్రిని కలిసిన ఎస్పీ



జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టాక భాస్కరభూషణ్ ఈ నెల 15న రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్‌ను తొలిసారి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఆయన మంత్రిని కలిసి జిల్లాలోని పలు అంశాలపై చర్చించారు.

### 'పరిష్కారం' అర్జీలను

# 'స్పందన'కు ఇచ్చిన అజీజ్

తాను చేపట్టిన 'పరిష్కారం' కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి ఆయా సమస్యలపై స్వీకరించిన అర్జీలను మాజీమేయర్, నెల్లూరు గ్రామీణ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ అబ్దుల్ అజీజ్ ఈ నెల 16న స్పందన కార్యక్రమంలో భాగంగా జిల్లా జాయింట్ కలెక్టర్ పి.వినోద్‌కుమార్‌కు అందజేశాడు. నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గాల పరిధిలో అనేక సమస్యల మీద తమకు అర్జీలు వచ్చాయని, ముఖ్యంగా 'హౌస్ ఫర్ ఆల్' స్కీం క్రింద నిర్మించిన ఇళ్ళు మంజూరైనా ఇంతవరకు తమకు కేటాయించకపోవడంపై లబ్దిదారులు అసంతృప్తి చెందుతున్నారని, తక్షణం ఈ సమస్యలను పరిష్కరించాలని ఆయన జేసీని కోరాడు.

# ఆకతాయిల అరెస్ట్

### ఎమ్మెల్యే రజనీపై అసభ్య పోస్ట్‌లు పెట్టిన టిడిపి మద్దతుదారులు

చిలకలూరుపేట ఎమ్మెల్యే విడదల రజనీపై ఫేస్‌బుక్‌లో అభ్యంతర పోస్ట్ పెట్టిన విడవలూరుకు చెందిన సత్యవోలు హరిప్రసాద్‌రెడ్డిని, పోస్ట్‌పై అసభ్యకర కామెంట్ చేసిన రాపూరు మండలం కండలేరు డ్యాంకు చెందిన పంతగాని ప్రవీణ్‌ను చిలకలూరిపేట అర్బన్ పోలీసులు అరెస్ట్ చేశారు. చిలకలూరిపేటకు చెందిన వైసిపి నాయకుడు మారుబోయిన నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిలకలూరిపేట అర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. వీరు టిడిపి మద్దతుదారులని తెలుస్తోంది. వీరికి బెయిల్ కూడా వచ్చింది. ఈ కేసును 'దిశ' చట్ట పరిధిలోకి తెచ్చి విచారిస్తే ఈ ఇద్దరికీ కష్టాలే!

# 'దిశ' చట్టం..హర్షణీయం

**- ప్రశంసించిన నెల్లూరు న్యాయవాదులు**

మహిళల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం 'దిశ' చట్టాన్ని తీసుకురావడం హర్షణీయమని వైఎస్సార్సీపి జిల్లా లీగల్‌సెల్ న్యాయవాదులు ఈనెల 16న నెల్లూరులోని జిల్లాకోర్టు ఆవరణంలో కేక్ కట్‌చేసి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బివి రమణారెడ్డి మాట్లాడుతూ మహిళల భద్రతకు రాష్ట్రప్రభుత్వం ఈ ప్రత్యేకచట్టం తీసుకురావడం ప్రశంసనీయమని కొనియాడారు. జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు కుడుముల రవికుమార్ మాట్లాడుతూ 'దిశ' చట్టంపై విద్యాసంస్థల్లో విస్తృతంగా ప్రచారం కల్పించాలని అంటూ ఈ చట్టాన్ని తీసుకువచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బార్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి ఇ.వి రామిరెడ్డి, పిడూరు నాగేశ్వరరావు, రంగారావు, నరసయ్య, రంగరాజన్, అజాంహుస్సేని తదితరులు పాల్గొన్నారు.

### అమ్మవారి విమాన గోపురం

# పునర్నిర్మాణం

నెల్లూరు, మూలాపేటలోని భువనేశ్వరీదేవి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో భువనేశ్వరి అమ్మవారి విమాన గోపుర పునర్నిర్మాణ పనులు మొదలుపెట్టారు. ఈ గోపురం అతిప్రాచీనమైనది కావడంతో అమ్మవారిని బాలాలయంలో ప్రతిష్టించి పునర్నిర్మాణం చేపట్టారు. నెలలోపు ఈ గోపుర పునర్నిర్మాణం పూర్తి చేసి, జనవరి 24 నుండి 27 వరకు నిర్వహించే మహాకుంభాభిషేకంలో కంచి పీఠానికి చెందిన 60మంది వేదపండితుల సమక్షంలో విమానగోపురంపై పంచ కలశాలను ప్రతిష్టిస్తారు.

# ముస్లింల భారీ నిరసన




కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన పౌరసత్వ సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 13వ తేదీన ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో నెల్లూరులో భారీ ప్రదర్శన నిర్వహించారు. జెండావీధి నుండి బయలుదేరిన ర్యాలీ బారకాసు, విఆర్‌సిల మీదుగా గాంధీబొమ్మ వరకు సాగింది. ఈ సందర్భంగా 'నో ఎన్‌ఆర్‌సి', 'నో సిఏబి' ప్లకార్డులను చేతపట్టి ముస్లింలు పెద్దసంఖ్యలో ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు.

# వైన్‌షాపుల వద్ద 'క్యూ'లు

కిలో 25రూపాయలకిచ్చే ఉల్లిపాయల కోసం రైతుబజార్ల వద్ద 'క్యూ'లు వున్నట్లే వైన్‌షాపుల వద్ద కూడా మందుబాబుల 'క్యూ'లు వుంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మద్యం అమ్మకాలపై నియంత్రణ మొదలు పెట్టడంతో మందుబాబుల అగచాట్లు అన్నీ ఇన్నీ కావు. రాత్రి 8గంటలకే వైన్‌షాపులను మూసేస్తుండడంతో షాపుల ముందు ఆ సమయంలో చాంతాడంత పొడవునా మందుబాబులు క్యూలో వుంటున్నారు. ఉల్లిపాయల కోసంకూడా ఇంత ఆసక్తిగా క్యూలలో నిలబడరేమో!

### రోడ్లపై గోవులను వదిలేస్తే...

# తిరుపతికి తరలిస్తాం

**- యజమానులకు కమిషనర్ హెచ్చరిక**

గోవులను రోడ్లపై వదిలితే గతంలో ఫతేఖాన్ పేటలోని పశువులదొడ్డికి తరలించేవాళ్ళమని, యజమానులు జరిమానా కట్టి తీసుకెళ్ళేవారని, ఎన్నిసార్లు అలా చేసినా యజమానుల్లో మార్పు లేదని, మళ్ళీ యథాతథంగా వాటిని రోడ్లపైనే విడిచిపెడుతున్నారని, అందువల్ల ఇకనుంచీ వాటిని తిరుపతిలోని గోశాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని నెల్లూరు నగరపాలకసంస్థ కమిషనర్ పివివిఎస్ మూర్తి యజమానులను హెచ్చరించారు. ఇప్పటికైనా యజమానులు స్పందించి గోవులను తమ ఇష్టానుసారం రోడ్లపై వదలకుండా వారి సంరక్షణలోనే ఉంచుకోవాలని స్పష్టం చేశారు.

# మైనార్టీ సంక్షేమ అధికారిగా హమీద్

జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిగా సయ్యద్ అబ్దుల్ హమీద్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పొదలకూరులోని జడ్పీ బాలుర హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న హమీద్ డిప్యూటేషన్‌పై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఈ స్థానంలో వున్న షేక్ మహ్మద్ ఇస్మాయిల్ తన మాతృశాఖ అయిన వ్యవసాయశాఖకు వెళ్లారు.

# అమరజీవిని చరిత్ర మరువదు



అమరజీవికి నివాళులర్పిస్తున్న మంత్రి అనిల్, జిల్లా కలెక్టర్ శేషగిరిబాబు

అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం ఈనెల 14న నెల్లూరులో జరిగింది. నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద వున్న అమరజీవి విగ్రహానికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్‌కుమార్ యాదవ్, జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరి బాబు, మాజీడిప్యూటీ మేయర్ ఎం.ద్వారకానాథ్, పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి అనిల్ మాట్లాడుతూ తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగనిరతిని చరిత్ర మరువదన్నాడు. ఇంతటి త్యాగమూర్తి నెల్లూరువాడైనందుకు ఎంతో గర్వంగా వుందని చెప్పాడు. అలాగే జిల్లా పోలీసు కార్యాలయంలో అమరజీవి చిత్రపటం వద్ద ఎస్పీ భాస్కర్‌భూషణ్ పూలమాలలు వేసి నివాళులర్పించాడు.




ఈ నెల 17వ తేదీన అమరావతిలో సూళ్లూరుపేటలో నిర్వహించబోయే "ఫ్లెమింగో ఫెస్టివల్" పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి, పక్కన డిజిపి గౌతమ్ సవాంగ్, మంత్రులు పి.అనిల్‌కుమార్‌యాదవ్, నాని, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, వరప్రసాద్, ఆనం రామనారాయణరెడ్డి, కిలివేటి సంజీవయ్య, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తదితరులు.

# అయ్యోరి బిడ్డ.. ఐపిఎస్ అయ్యాడు

- 'కష్టే ఫలీ'కి.. నిదర్శనం శివకిశోర్
- ఆలిండియా స్థాయిలో 153వ ర్యాంకు

*కష్టపడి చదువుకుంటే ఎంతటివారైనా ఉన్నతస్థాయికి చేరుకుంటారనేందుకు ఆత్మకూరులోని శివకిశోర్ ఒక తాజా నిదర్శనం. అయ్యోరి బిడ్డ అయినా ఎంతో కృషితో, పట్టుదలతో ఐపిఎస్ సాధించి అందరికీ ఆదర్శమయ్యాడు.*

ఆత్మకూరులోని జెఆర్ పేటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కొమ్మి నారాయణరావు కుమారుడు కొమ్మి ప్రతాప్ శివకిశోర్. ఇటీవల సివిల్స్ పరీక్షలురాసి, ఆలిండియా స్థాయిలో 153వ ర్యాంక్‌ను సాధించి ఐపిఎస్‌కు ఎంపికై స్థానికులకు ఆశ్చర్యాన్నీ.. ఆనందాన్నీ కలిగించడమే కాక.. అందరికీ మార్గ దర్శకంగా నిలిచాడు. మర్రిపాడు మండలం కృష్ణాపురంలోని నవోదయ పాఠశాలలో చదువుకున్న శివకిశోర్, నెల్లూరులో ఇంటర్ పూర్తిచేసి ఆ తర్వాత ఖరగ్‌పూర్ ఐఐటిలో బీటెక్, ఎంటెక్ పూర్తిచేశాడు. అనంతరం బెంగుళూరులోని బోష్ కంపెనీలో ఉద్యోగం చేస్తూనే, ఎలాంటి కోచింగ్ లేకుండా సివిల్స్ పరీక్షలకు సిద్ధమయ్యాడు. ఎంతో కష్టపడి చదువుకుని ఆలిండియా స్థాయిలో మంచి ర్యాంకు సాధించి ఐపిఎస్‌కు ఎంపికయ్యాడు. ఆత్మకూరు నియోజకవర్గంలోనే ఐపిఎస్‌కు ఎంపికైన తొలి యువకుడు శివకిశోరేనంటూ స్థానిక ప్రజలు, వారి సన్నిహితులు ఆనందం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్సీపి నాయకుడు సూరా భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో శివకిశోర్‌కు అభినందన సభ ఏర్పాటుచేసి ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ శ్రావణ్ తదితరులు మాట్లాడుతూ, శివకిశోర్ కృషి, పట్టుదల విద్యార్థి లోకానికి మార్గదర్శకమన్నారు. శివకిశోర్ భవిష్యత్తులో మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏ.ఇ రాజాబాబు, మునిసిపల్ మాజీ వైస్‌ఛైర్మెన్ సందానిబాషా, స్థానిక ప్రముఖులు వి.నారాయణ రెడ్డి, లక్ష్మీరెడ్డి, షేక్ రిజ్వానా, ఎల్ఐసి రమేష్, ఈశ్వర్‌రెడ్డి, ఎస్.యానాదిరెడ్డి, కృష్ణారెడ్డి, పి.జవహర్‌లాల్, ఎల్.ప్రసాద్, న్యాయవాది నజీర్ తదితరులు పాల్గొన్నారు.



కొమ్మి ప్రతాప్ శివకిశోర్‌ను అభినందిస్తున్న ప్రముఖులు

# పక్షుల పండుగను జయప్రదం చేయండి

## - ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

జనవరి 3,4,5 తేదీల్లో సూళ్ళూరుపేటలో పక్షుల పండుగ(ఫ్లెమింగో ఫెస్టివల్) నిర్వహించడం జరుగుతుందని, ఈ పండుగను అందరం కలిసి విజయవంతం చేయాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కోరారు. ఈనెల 14న ఆయన సూళ్ళూరుపేటలో ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, జిల్లా అధికారులతో కలసి ఈ పండుగ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలివేటి మాట్లాడుతూ ప్రభుత్వం ఈ పండుగ నిర్వహణ కోసం కోటి రూపాయలు మంజూరు చేసిందన్నారు. 3వ తేది ఉదయం 9 గంటలకు రాష్ట్ర మంత్రులు ఈ పండుగను ప్రారంభిస్తారని చెప్పారు. ఈ మూడు రోజులూ ప్రతిరోజూ సాయంత్రం 4గంటల నుంచి సూళ్ళూరు పేట బాలుర ఉన్నతపాఠశాల మైదానంలో స్థానిక కళాకారులతో పాటు అనేక సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, సూళ్లూరుపేట మైదానంలో ప్రభుత్వానికి సంబంధించిన స్టాల్స్, షార్ ఆధ్వర్యంలో స్టాల్, సందర్శకులకు తాగునీటి వసతి, మరుగుదొడ్ల సదుపాయాలు వగైరా మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. క్రీడాపోటీలు, జబర్దస్త్ కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. తొలిరోజున మంత్రులు ఈ పండుగను ప్రారంభిస్తారని, దొరవారిసత్రం మండలంలోని నేలపట్టు పక్షుల కేంద్రం సందర్శన, తడ మండలంలోని బీవిపాళెం వద్ద బోటు షికారు ఉంటాయని తెలిపారు. ఈ పండుగ రోజుల్లో విద్యార్థులకు, సందర్శకులకు సూళ్లూరుపేట నుంచి ఉచిత బస్సులు ఏర్పాటు చేస్తున్నామని, ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. వైఎస్సార్సీపి నాయకులు దువ్వూరు బాల చంద్రారెడ్డి, శేఖర్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, శ్రీమంత్ రెడ్డి, జేసీ-2 కమలకుమారి, శ్రీనివాస కుమార్, ఆర్డీఓ సరోజిని, డిఎఫ్ఓ హిమ శైలజ, డిపిఓ ధనలక్ష్మి పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# మహిళల రక్షణకు.. పటిష్ఠ చర్యలు



- 'దిశ' చట్టంతో మహిళలకు సంపూర్ణ భద్రత
- అన్ని పోలీస్‌స్టేషన్లలో మహిళామిత్ర కమిటీలు
- తక్షణ సాయానికి డయల్ 100, 112, 181
- జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్ వెల్లడి

జిల్లాలో మహిళల భద్రతకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నామని, మహిళలపై అకృత్యాలకు పాల్పడేవారిని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని, అలాంటి వారిపై క్రిమినల్ కేసులు పెట్టడంతో పాటు రౌడీషీట్లు కూడా తెరుస్తామని జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్ స్పష్టం చేశారు. ఈ నెల 16న ఆయన నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మహిళల రక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాష్ట్రప్రభుత్వం ఏర్పాటుచేసిన 'దిశ' చట్టం-2019తో మహిళలకు సంపూర్ణ భద్రత కలుగుతుందని, ఈ చట్టం దేశానికే మార్గదర్శకం కానుందని అన్నారు. మహిళలకు అత్యవసర వేళల్లో, ఆపద సమయాల్లో తక్షణ సాయం అందించేందుకు ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారం అందిస్తే పోలీసులు వెంటనే స్పందించి రక్షణ చర్యలు తీసుకుంటారన్నారు. మహిళల పట్ల, చిన్నారుల పట్ల, వృద్ధుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, దాడులకు పాల్పడినా సహించేది లేదని, నిందితులు ఎంతటివారైనా సరే కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్లలో మహిళామిత్ర కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని, మహిళా పోలీసుతో పాటు స్వచ్ఛంధసంస్థల సభ్యులు, న్యాయవాది, ఉపాధ్యాయురాలు, డ్వాక్రా సభ్యురాలు, అంగన్‌వాడీ, ఆశావర్కర్లును ఈ కమిటీల్లో భాగస్వాములను చేసి, మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తామన్నారు. జిల్లాలోని 12 శక్తిబృందాల ఆధ్వర్యంలో కళాశాలలు, పాఠశాలల్లోనూ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కళాశాలల్లో ర్యాగింగ్ నిరోధానికి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహిళలు ఏ పరిస్థితుల్లోనైనా సరే ఆందోళన చెందకుండా పోలీసులకు సమాచారం అందిస్తే తగు రక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ఆపద సమయాల్లో టోల్‌ఫ్రీ నంబర్లు 100, 112, 181కి సమాచారం అందించాలన్నారు. మహిళలు తమ స్మార్ట్‌ఫోన్‌లో జిపిఎస్ ఆన్‌చేసి లొకేషన్‌ను పోలీసు వాట్సాప్ నంబరు 93907 77727కు షేర్ చేస్తే చాలు పోలీసులు వెంటనే స్పందిస్తారని, అదేవిధంగా సోషల్‌మీడియాలో వేధింపులు, మార్ఫింగ్‌లు వగైరాలపై సైబర్ మిత్ర 91212 11100 నంబరుకు మెసేజ్ పంపితే ఆ నంబర్లకు వచ్చే సమాచారాన్ని, ఫోన్‌కాల్స్‌ను పోలీసు ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారని చెప్పారు.

అశ్రునివాళి



జననం
20.5.1938

మరణం
5.12.2019

మనసున్న మంచి మనిషి.. మానవత్వం కలిగిన వైద్యరత్నం
డా॥ ఎం. పెంచలమ్మ గారి
ఆకస్మిక మృతికి చింతిస్తూ...
వారి ఆత్మకు శాంతి చేకూర్చమని భగవంతుని కోరుకుంటున్నాం.

డాక్టర్ పి.జయప్రద
అధ్యక్షురాలు

డాక్టర్ అపూర్వ పల్లంరెడ్డి
కార్యదర్శి

NELLORE OBSTETRIC & GYNECOLOGICAL SOCIETY

### మహిళల భద్రతకు..

# సీఎం జగన్ చర్యలు అభినందనీయం




**ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎన్‌బికెఆర్ ఐఎస్టీ విద్యార్థినులు**

రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి మహిళల భద్రత కోసం తీసుకుంటున్న చర్యలు దేశ చరిత్రలోనే ప్రథమంగా నిలుస్తాయని విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి విద్యార్థినులు కొనియాడారు.

ఈనెల 15న విద్యానగర్‌లోని కళాశాల వద్ద నుంచి గాంధీబొమ్మ కూడలి వరకు విద్యార్థినుల భారీ ర్యాలీ నిర్వహించి, ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ 'దిశ' చట్టం ఏర్పాటుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తమకెంతో సంతోషం కలిగించిందన్నారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం స్పందిస్తున్న తీరు అభినందనీయమన్నారు. అదేవిధంగా, సోషల్‌మీడియాలో మహిళలను కించపరిచినా కఠినచర్యలు తీసుకోవాలని నిర్ణయించడం శుభపరిణామమన్నారు. మహిళల రక్షణ కోసం పటిష్టమైన చర్యలు తీసుకుంటున్న సీఎం జగన్మోహన్‌రెడ్డి దేశచరిత్రలోనే మహిళా రక్షకుడుగా నిలిచారని పేర్కొన్నారు. మహిళలపై అకృత్యాలకు పాల్పడే నిందితులకు కేవలం 21 రోజుల్లోనే శిక్ష పడేలా చట్టం రూపొందించాలని నిర్ణయించడంతో ప్రతి జిల్లాలో ప్రత్యేక కోర్టుల ఏర్పాటుతో బాధిత మహిళలకు సత్వర న్యాయం జరుగుతుందని అన్నారు. అందుకు మహిళా లోకమంతా సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెప్తోందన్నారు.

# పెండింగ్ పనులు పూర్తి చేయండి

## అధికారులను ఆదేశించిన అనిల్



నెల్లూరు నగర నియోజక వర్గంలో పెండింగ్‌లో వున్న అన్ని అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్ కుమార్‌యాదవ్ అధికారులను ఆదేశించాడు. ఈనెల 14న ఆయన నెల్లూరు ఇస్కాన్‌సిటీలోని క్యాంప్ కార్యాలయంలో కార్పొరేషన్, ఇంజనీరింగ్, పబ్లిక్‌హెల్త్, శానిటేషన్ అధికారులతో సమావేశమయ్యాడు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సిమెంట్ రోడ్లు వేయలేని ప్రాంతాల్లో క్వారీడస్ట్‌తో రోడ్లు వేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నాడు. ప్రజలకు సురక్షిత మంచినీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, నగరంలో చెట్లను నాటడమే కాకుండా వాటిని పెంచే బాధ్యత కూడా తీసుకోవాలని అధికారులకు సూచించాడు. చెట్ల పెంపకంపై ప్రజల్లో, విద్యార్థులలో చైతన్యం తీసుకురావాలన్నాడు. నగరంలో చెదురుమదురుగా ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు పెట్టకుండా వాటిని ఒక క్రమ పద్ధతిలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నాడు.

ఈ సమావేశంలో నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ ఎం.ద్వారకానాథ్, వైసిపి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పి.రూప్‌కుమార్‌యాదవ్, కార్పొరేషన్ కమిషనర్ పివివిఎస్ మూర్తి పాల్గొన్నారు.

# నత్తనడకన.. ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం



అసంపూర్తిగా ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి

**గూడూరు డివిజన్ వార్తలు**

గూడూరు పట్టణాన్ని రైల్వే లైను రెండుగా విభజిస్తోంది. 1వ టౌన్, 2వ టౌన్‌గా ఏర్పడిన ఈ ప్రాంతంలో అటు ఇటు రాకపోకలు సాగించేందుకు ఎంతో కాలంగా ప్రజలు నిత్యం నానా రకాలుగా బాధలు పడుతూనే ఉన్నారు. ఈ మార్గం మధ్యలో దక్షిణం వైపు అండర్ బ్రిడ్జి ఉంది. ప్రస్తుతం పట్టణ జనాభా అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు లేకపోవడంతో తరచూ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. రైళ్ళ రాకపోకల కోసం ఈ ప్రాంతంలో అనేకసార్లు రైల్వేగేట్లు మూయవలసి వస్తోంది. ఆ సమయాల్లో ప్రజలు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. దీంతో పాటుగా అండర్‌బ్రిడ్జి ప్రాంతంలో కూడా నిత్యం రాకపోకలు స్తంభిస్తున్నాయి. ప్రజల సౌకర్యం కోసం నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి పనుల నత్తనడకన సాగి, ఇప్పుడు అసలు పనులు చాలా మందకొడిగా ఉన్నాయి. దీంతో ఏదైనా అత్యవసరపు పని ఉన్నప్పుడో, లేదా ఆపద సమయాల్లోనో ప్రజలు పట్టణానికి రావాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ కష్టాలు తీరేందుకు 1,2 పట్టణాలను కలిపే విధంగా చేపట్టాల్సిన ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు మంచి ఆశయంతో ప్రారంభించినా, ఆచరణలో మాత్రం ఒక అడుగు ముందుకి, రెండడుగులు వెనక్కి అన్నట్లుగా తయారరైంది పరిస్థితి. ఏ నాయకుని దృష్టికో, అధికారులతోనో ఈ విషయం విన్నవించినా బ్రిడ్జి నిర్మాణపు పనులు త్వరలోనే పూర్తిచేస్తామని చెప్తూనే ఉన్నారు తప్ప ఆచరణ మాత్రం లేదని, ఈ బ్రిడ్జి పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నట్లుగా తయారైందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు, స్థానిక నాయకులు అందరూ కృషి చేసి గూడూరు ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన ఈ బ్రిడ్జి నిర్మాణాన్ని వెంటనే పూర్తిచేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

## - మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్




సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పథకాన్ని కొనసాగించేలా రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కోరారు. గూడూరు పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో పింఛన్‌దారుల దినోత్సవాన్ని ఈనెల 17న గూడూరు పట్టణ ప్రముఖ వైద్యుడు డాక్టర్ సి.జనార్దన్‌రెడ్డి, ఏపి ఉద్యోగుల సంఘం జేఏసి నాయకుడు షేక్ రియాజ్‌అహ్మద్‌లతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సునీల్ మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం ప్రభుత్వం సిపిఎస్ విధానంపై చర్చించడం జరిగిందని, కానీ రద్దు కాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగులు ఐక్యతతో పోరాడి తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం పలువురు విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు మహబూబ్‌బాషా, షేక్ బాషా, భాస్కర్‌రావు, ఎస్‌బిఐ డిప్యూటి బ్రాంచ్ మేనేజర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రాజీతోనే సత్వర పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి రమణయ్య తదితరులు

కక్షిదారులు రాజీపడితే వారికి సమయం, ఆర్థిక వ్యయం ఆదాతో పాటు సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని 7వ అదనపు జిల్లా న్యాయమూర్తి రమణయ్య అన్నారు. గూడూరు పట్టణంలోని కోర్టు ఆవరణంలో ఈ నెల 14న మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్‌అదాలత్ జరిగింది. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు కక్షిదారులతో చర్చించి పలు కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో పరిష్కరించిన కేసులను తిరిగి ఏ న్యాయస్థానాలు స్వీకరించవన్నారు. కేసుల సత్వర పరిష్కారానికి రాజీమార్గమే ఉత్తమమని, ఇరువర్గాలకు న్యాయం చేకూరుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీనియర్ సివిల్‌జడ్జి జానీబాషా, అదనపు జ్యుడిషియల్ జడ్జి లావణ్య, డిఎస్పీ శ్రీభవాని హర్ష, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్‌రావులతో పాలు పలువురు సిఐలు, ఎస్‌ఐలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

# అమరజీవి త్యాగం అజరామరం

## - పొట్టి శ్రీరాములు వర్ధంతిలో వక్తలు



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తహశీల్దార్ లీలారాణి

అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఈనెల 15న పలువురు ప్రముఖులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గూడూరులోని మండల రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ లీలారాణి శ్రీ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆంధ్రరాష్ట్ర సాధనకోసం అసువులు బాసిన శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగనిరతి నిరుపమానమైనదని ఆమె అన్నారు. అమరజీవి చిత్తశుద్ధిని, లక్ష్య శుద్ధిని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉప తహశీల్దార్, ఆర్‌ఐలు, విఆర్‌ఓలు పాల్గొన్నారు.



రమేష్‌కు చక్రాల కుర్చీని అందజేస్తున్న మండ్ల సురేష్‌బాబు

### సిఎస్‌ఎం పాఠశాలలో..

# ఉచిత వైద్యశిబిరం

గూడూరు పట్టణంలోని సిఎస్‌ఎం పాఠశాలలో ఈనెల 15న చేగువేరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, వైకాపా నాయకుడు మండ్ల సురేష్‌బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన ఈ శిబిరంలో వైద్యులు పేదలను పరీక్షించి వారికి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం దివ్యాంగుడు రమేష్‌కు చక్రాల కుర్చీని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదినారాయణరెడ్డి, క్రాంతి వైద్యులు భాస్కర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### పాలచ్చూరు, కైలాసకోనల్లో..

# కేంద్రీయ విద్యాలయాలు

### తిరుపతి ఎంపీ బల్లి దుర్గాప్రసాద్‌రావు వెల్లడి



కేంద్రమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్న బల్లి దుర్గాప్రసాద్

నెల్లూరుజిల్లా పెళ్ళకూరు మండలంలోని పాలచ్చూరు గ్రామంలో, చిత్తూరుజిల్లా నారాయణవనం మండలంలోని కైలాసకోనలోనూ వచ్చే విద్యాసంవత్సరం నుంచి కేంద్రీయ విద్యాలయాలు ప్రారంభమవుతాయని తిరుపతి ఎంపీ బల్లి దుర్గాప్రసాద్‌రావు వెల్లడించారు. తిరుపతి పార్లమెంట్ పరిధిలో ఈ రెండు కేంద్రీయ విద్యాలయాలు మంజూరు చేసినందుకు ఆయన ఈనెల13న కేంద్ర మానవవనరుల శాఖ మంత్రిని కలిసి కృతజ్ఞతలు చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సారధ్యంలో తిరుపతి పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో పలు అభివృద్ధిపనులను సంబంధిత కేంద్రమంత్రుల దృష్టికి తీసుకువెళ్ళి మంజూరుకు కృషి చేస్తున్నారని ఆయన వివరించారు.

## ప్రభుత్వ సంగీత నృత్యపాఠశాలలో శ్రీ త్యాగరాజస్వామి ఆరాధన

బహుళ పంచమిని పురస్కరించుకుని నెల్లూరు నగరంలోని ప్రభుత్వ సంగీత నృత్యపాఠశాల ప్రాంగణంలో పాఠశాల ప్రిన్సిపాల్ మద్దెల సాయిబాబా ఆధ్వర్యంలో ఈనెల 16వతేది రాత్రి శ్రీ త్యాగరాజస్వామి ఆరాధన నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు ఇంద్రనీల్, పద్మావతి, హన్సీ, ప్రదీప్‌గౌతమ్, శశికళ, సుప్రజ, శోభారాణి, రమాదేవి, వి.రవీంద్రనాథ్‌శర్మ త్యాగరాజస్వామి కీర్తనలను ఆలపించి అందరినీ భక్తిపారవశ్యులను చేశారు. కె.తిరుపతమ్మ, ఎం.లోకేష్‌బాబు, ఐ.పినాకపాణి పాల్గొన్నారు.

### ప్రతిభ చాటి...

# వీయస్‌యూకు గుర్తింపు తేవాలి

### - వైస్ ఛాన్సలర్ సుదర్శనరావు

సౌత్‌జోన్ యూత్ ఫెస్టివల్ పోటీల్లో వీయస్‌యూ ప్రప్రథమంగా పాల్గొంటుందని, ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ప్రతిభ కనపరచి వీయస్‌యూకు గుర్తింపు తేవాలని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ సుదర్శనరావు ఆకాంక్షించారు. ఈనెల 18 నుండి 22 వ తేదీ వరకు తమిళనాడు కారైకుడిలోని అళగప్ప విశ్వవిద్యాలయంలో జరిగే 35వ సౌత్‌జోన్ యూత్ ఫెస్టివల్ పోటీల్లో పాల్గొనే విద్యార్థులను ఈనెల 16 న ఆయన అభినందించారు. నెల్లూరులోని రావూస్ కళాశాల నుంచి ముగ్గురు, వీఆర్ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బీఇడీ కళాశాల, జెనెక్స్ విజన్ డిగ్రీ కళాశాల నుంచి ఒక్కొక్కరు ఎంపికయ్యారు. ఈ పోటీలకు టీమ్ మేనేజర్లుగా వీయస్‌యూ అధ్యాపకులు హనుమారెడ్డి, విజయ ఎంపికయ్యారు.

## సౌత్‌జోన్ బ్యాడ్మింటన్ పోటీలకు వీఆర్‌సీ విద్యార్థులు

అంతర్ విశ్వ విద్యాలయ సౌత్ జోన్ బ్యాడ్మింటన్ పోటీలకు వీఆర్‌సీ విద్యార్థులు ఎంపికయ్యారు. పోటీలకు ఎంపికైన ఐ.ఈశ్వర్ సాయి, జే.సాకేత్‌లకు ఈనెల 14న అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ రవీంద్రబాబు మాట్లాడుతూ ఈనెల 16 నుంచి చెన్నై యస్‌ఆర్‌ఎం విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్‌జోన్ పోటీలకు తమ విద్యార్థులు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం తరపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ బాబర్ మొహీద్దీన్ ఆలీ, వైస్ ప్రిన్సిపల్ టీవీ రవీంద్రరెడ్డి, అధ్యాపకులను, క్రీడాకారులను అభినందించారు.

### రైతులకు ఉపయోగంగా..

# వ్యవసాయ హబ్‌లు

### వ్యవసాయశాఖ రీజనల్ మేనేజర్

రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల పంపిణీకి, రైతులకు ఉపయోగకరంగా ఉండేందుకు జిల్లాలో కొత్తగా వ్యవసాయ హబ్‌లను ఏర్పాటుచేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. చిల్లకూరు మండలంలోని ముత్యాలపాడు ఏఎంసి గోడౌన్‌లో ఆ మేరకు వసతులున్నాయా లేదా అని ఈనెల14న వ్యవసాయ శాఖ రీజనల్ మేనేజర్ శివప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నెల్లూరు, కావలి, ఆత్మకూరు, సూళ్ళూరుపేట, చిల్లకూరు ఏఎంసి గోడౌన్లలో ఈ హబ్‌ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఆయన వెంట చిల్లకూరు ఏ.ఓ భవాని, చెంచుకృష్ణయ్య తదితరులున్నారు.

### కలువాయి జడ్పీ స్కూల్

# హెడ్‌మాస్టర్ సస్పెన్షన్

కలువాయిలోని జడ్పీ హైస్కూల్ హెడ్‌మాస్టర్ సద్దా జనార్ధన్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ గుంటూరు ఆర్‌జెడి కార్యాలయం నుంచి డిఇఓకి ఈనెల 16న ఆదేశాలు జారీ అయ్యాయి. కలువాయి హైస్కూల్‌లో మధ్యాహ్నభోజనం పథకం అమలులో అవతవకలు చోటుచేసుకోవడంతో ఇటీవల జేసీ-2 కమలకుమారి ఈ పాఠశాలకు వచ్చి విచారణ జరిపి రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో హెడ్‌మాస్టర్‌ను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని తెలుస్తోంది.

# లోకేష్ ప్రజావిధ్వంస పాదయాత్ర

శ్రీను గల్పిక

హైటెక్‌రత్న చంద్రబాబునాయుడు తన రక్తాన్ని చెమటగా మార్చి కట్టించిన హైదరాబాద్ నగరమది. అందులో చంద్రబాబు పేద నివాసం. చంద్రబాబు, భువనేశ్వరీదేవి, లోకేష్, బ్రాహ్మణిలు హాల్‌లో కూర్చుని వున్నారు. అప్పుడే దేవాన్ష్ పూజగదిలో దేవుళ్ళ పటాలకు దండం పెట్టుకుని వస్తున్నాడు. అది చూసి భువనేశ్వరిదేవి ముచ్చటపడి దేవాన్ష్‌ను దగ్గరకు తీసుకుని స్వామికి ఏం చెప్పావు బంగారం అని అడిగింది. అందుకు దేవాన్ష్... మా తాతయ్యను నాతో తీరికగా ఆడుకునేలా చేసినందుకు ఆ స్వామికి థ్యాంక్స్ చెప్పాను నానమ్మ అని అన్నాడు. ఆ మాటకు చంద్రబాబు, లోకేష్‌లు ఖంగు తిన్నారు. వెంటనే చంద్రబాబు లోకేష్‌తో కోపంగా.. ఇంట్లో తిని కూర్చుంటుంటే ఎవరూ లీడర్‌లు కారు... ప్రజల్లో తిరగాలి, ప్రజలతో మమేకం కావాలి. లీడర్‌గా ఎలా ఎదగాలో ఈ సీన్‌లు చూసన్నా నేర్చుకో అంటూ ఒక సిడి తీసి సిడి ప్లేయర్‌లో పెట్టి టీవీ ఆన్ చేశాడు.

★★★★★

వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఓదార్పు యాత్ర, ప్రజాసంకల్ప పాదయాత్రకు సంబంధించిన సన్నివేశాలు వస్తున్నాయి. జగన్ వేల కిలోమీటర్లు నడవడం, పూరి గుడిసెల్లో పేదలు కలిపి పెట్టిన అన్నం తినడం, ఒంటి మీద గుడ్డలు లేని పేద పిల్లలను ఎత్తుకుని ముద్దాడడం, పొలాల్లో దిగడం, ఆయనను చూసేందుకు ప్రజలు పోటెత్తినట్లు రావడం, 2019 ఎన్నికల్లో జగన్ గెలవడం... ఇలా అన్ని అంశాలతో ఒక గంట నిడివిగల వీడియోను లోకేష్‌కు చంద్రబాబు చూపించాడు. ఆ వీడియో చూడడం అయ్యాక లోకేష్‌తో వుండి... జగన్ మనకు రాజకీయ శత్రువు కావచ్చు... కాని సాధారణ స్థితి నుండి ఒక వ్యక్తి అన్ని సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని ఎలా లీడర్‌గా ఎదగాలన్న దానికి అతనొక రోల్‌మోడల్. ఈ వీడియో అంతా చూశాక నువ్వు గుర్తించిందేంటి చెప్పు అని లోకేష్‌ను అడిగాడు. దానికాయన... పాదయాత్ర చేస్తే ఎక్కడపడితే అక్కడ కావాల్సినంత తినొచ్చు... తిన్నది అరగడానికి బాగా తిరగొచ్చు అని నాకు అర్థమైందని చెప్పాడు. దానికి చంద్రబాబు తల బాదుకుని... ఇందుకేనేమో రామ్ గోపాల్‌వర్మ మన మీద పనిగట్టుకుని సినిమా తీశాడు. లీడర్‌గా ఎదగాలంటే తిండి నీ కోసం కాదు, జనం సంతృప్తి కోసం తినాలి, జనం సమస్యలు తెలుసుకోవడానికి తిరగాలి... అంతేగాని తిన్నది అరగడానికి కాదు అని అరిచాడు. అప్పుడు లోకేష్... డాడీ నన్ను తక్కువ అంచనా వేయకండి నాలో నిద్రపోతున్న సింహాన్ని లేపకండి... నేనేంటో ఈరోజు అసెంబ్లీ ముట్టడిలో చూపిస్తాను అంటూ ఆవేశంగా లేచాడు. లోకేష్ ఆవేశాన్ని చూసి చంద్రబాబు... ఈరోజు వీడేదో గందరగోళం చేసేటట్లున్నాడని మనసులో ఆందోళన చెందాడు.

★★★★★

చంద్రబాబు కలల రాజధాని అమరావతిలో సింగపూర్ సాంకేతిక పరిజ్ఞానంతో వానాకాలంలో వర్షం నీళ్లు కారేలా, ఎండాకాలంలో లోపల ఎండ తగిలేలా కట్టించిన అసెంబ్లీ భవనం. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు వచ్చి తమ స్థానాలలో కూర్చున్నారు. స్పీకర్ తమ్మినేని సీతారాం వచ్చి తన స్థానంలో కూర్చోవడంతో సభ మొదలైంది. అంతలో బయట కలకలం మొదలైంది. ఏంటా గొడవ అంటూ సీఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డి, మంత్రులు కొడాలి నాని, పేర్ని నాని, ఆళ్ల నాని, పి.అనిల్‌కుమార్ యాదవ్, మేకపాటి గౌతమ్‌రెడ్డిలు బయటకొచ్చారు. అక్కడ మొదటి గేటు వద్ద లోకేష్ వీరవిహారం చేస్తున్నాడు. ఒక మార్షల్ గొంతు పట్టుకున్నాడు. ఇంకో మార్షల్‌ను కడుపులో గుద్దితే అతను దూరంగా పోయి గోడకు గుద్దుకున్నాడు. మరో మార్షల్‌ను కొడితే గాల్లోకి లేచాడు. అక్కడ జగన్ బ్యాచ్‌ను చూసిన లోకేష్ ఆవేశంగా... "ఇప్పటి వరకు ఒక లెక్క... ఇకనుండి మరో లెక్క... సాఫ్ట్‌గా వున్నాడు, సాఫ్ట్‌వేర్ చదివాడనుకుంటున్నారేమో... నిప్పుగారి కొడుకు పప్పుగాడు వచ్చాడని మీ వాళ్ళకు చెప్పండి... పట్టుకుంటే ఫైరే" అని డైలాగ్ వదిలాడు. లోకేష్ ఆవేశాన్ని, ఆ డైలాగ్ డెలివరీని చూసి చంద్రబాబే ఆశ్చర్యపోయాడు. జగన్ టీమ్ అయితే లోకేష్‌లోని రెండో కోణాన్ని చూసి... "వీడు పప్పు కాదురా నిప్పు, జాగ్రత్తగా లేకుంటే మనకు తప్పదు ముప్పు" అని అనుకుంది.

★★★★★

హైదరాబాద్‌లోని చంద్రబాబు ఇల్లు. అమరావతిలో అసెంబ్లీ సమావేశం ముగించుకుని చంద్రబాబు, లోకేష్‌లు ఇంటికి చేరారు. చంద్రబాబు ఇంట్లో అడుగుపెట్టగానే భువ... అంటూ కేకేశాడు. లోపల నుండి భువనేశ్వరితో పాటు బ్రాహ్మణి కూడా వచ్చింది. ఏమండి, అంతలావున కేకేశారు అని భువనేశ్వరీ అడిగింది. చంద్రబాబు ఆమెతో... ఈరోజు అసెంబ్లీ వద్ద మన లోకేష్ పెర్ఫార్మెన్స్ అదిరిపోయింది. లోకేష్ అసెంబ్లీ గేటును తోసుకుని పోతుంటే అతనిలో నాకు వీరపాండ్య కట్టబ్రహ్మన్ కనిపించాడు. మనోడిలో ఫైర్ వుంది. ఖచ్చితంగా పాదయాత్ర చేసి ప్రజల్లోకి వెళితే వచ్చే ఎన్నికల్లో సీఎం అవుతాడు. ఈపూటకు రెండు పుల్కాలు ఎక్స్‌ట్రాపెట్టు పాపం బాగా అలసిపోయాడు అని చెప్పాడు. తర్వాత స్నానాలు చేసొచ్చి టిఫిన్ కానిచ్చారు. ఎవరి బెడ్ రూమ్‌ల్లోకి వాళ్ళు వెళ్లి నిద్రకు ఉపక్రమించారు. భువనేశ్వరీదేవికి... మనోడు పాదయాత్ర చేసి ప్రజల్లోకి వెళితే సీఎం కావడం ఖాయం అన్న మాటలు ఆమె చెవుల్లో మార్మోగసాగాయి. ఆ మాటలను గుర్తు చేసుకుంటూనే ఆమె నిద్రలోకి జారుకుంది.

★★★★★

కృష్ణా జిల్లా గుడివాడ తాలూకా నిమ్మకూరు ప్రాంతం. ఎన్టీఆర్ జన్మస్థలం. భారీఎత్తున జనాలున్నారు. వారందరి చేతుల్లో తెలుగుదేశం జెండాలున్నాయి. చంద్రబాబుతో పాటు అమెరికా మాజీఅధ్యక్షుడు బిల్‌క్లింటన్, హిల్లరీ క్లింటన్, సాఫ్ట్‌వేర్ దిగ్గజం బిల్‌గేట్స్, వివిధ దేశాల అధ్యక్షులు, రాహుల్‌గాంధీ, కుమారస్వామి, స్టాలిన్, మమతా బెనర్జీ, మాయావతి, ములాయంసింగ్ వంటి వివిధ పార్టీల నాయకులు అతిథులుగా రాగా లోకేష్ ప్రజావిధ్వంస పాదయాత్ర మొదలైంది. మహిళలు మంగళహారతులతో లోకేష్ నడక మొదలుపెట్టాడు. ఒకచోట ఆయనకు ఓ పేద కుటుంబీకులు ఇంట్లోకి పిలిచి అన్నంపెట్టి పప్పు వడ్డించారు. ఆయన కలుపుకుని తిని... పప్పు చాలా బాగుంది, పప్పును కంది పప్పుతో చేశారా అని అడిగాడు. కంది పప్పుతో కాక మినపప్పుతో పప్పు చేస్తారా అని వాళ్ళు మనసులో అనుకుని అవును బాబు అని చెప్పారు. తర్వాత లోకేష్ గ్రామగ్రామాలను దాటుకుంటూ పోతున్నాడు. ఓ గ్రామంలో అభిమానులు ఆయనను ఆపి లస్సీ ఇచ్చారు. ఆయన అది తాగి తియ్యగా వుంది... దీంట్లో చక్కెర కలిపారా అని అడిగాడు. అక్కడున్న వాళ్ళు మనసులో లస్సీలో చక్కెర కాకుంటే సోడా ఉప్పు కలుపుతారా అని మనసులో అనుకుని, చక్కెర కలిపాం సార్ అని ఆయనతో అన్నారు. తర్వాత ఆయన ఏ గ్రామంలోకి వెళ్లినా అక్కడ ఎవరు ఏది పెడితే అది కాదనకుండా తినసాగాడు. బజ్జీల బండి వద్ద బజ్జీలు, పానీపూరి బండి వద్ద పానీపూరీలు, స్వీట్స్ షాపు వద్దకు వెళితే స్వీట్స్... ఇలా అన్నీ తింటూ అందరితో కలిసిపోయి ముందుకు పోసాగాడు. లోకేష్ పాదయాత్ర బ్రహ్మాండంగా జరుగుతోంది. ప్రజలు నీరాజనాలు పడుతున్నారు. లోకేష్ ప్రజానాయకుడు అయ్యాడు అని టీవీలలో ఆ పాదయాత్ర దృశ్యాలు చూస్తూ చంద్రబాబు, భువనేశ్వరిదేవిలు సంబరపడసాగారు.

ఇలా వుండగా ఒకరోజు ఇంట్లో ల్యాండ్‌లైన్ రింగయ్యింది. భువనేశ్వరీదేవి ఫోన్ ఎత్తింది. అవతల వ్యక్తి... మేడమ్ లోకేష్‌ను ఆసుపత్రిలో చేర్చాము. కనిపించిందల్లా తిని ఆయన కడుపు కంబాలపాడు చెరువయ్యింది. నాగార్జున సాగర్ కుడికాలువకు గండి పడినట్లుగా ఒకటే విరోచనాలు... మీరు వెంటనే రండి అంటూ ఫోన్ పెట్టేశాడు. ఆ మాట వినగానే... లోకేష్... లోకేష్... నీకేం కాలేదుగా నాయనా... అని భువనేశ్వరీదేవి కేకలు పెట్టసాగింది. ఆ కేకలకు చంద్రబాబు ఉలిక్కిపడి లేచాడు. నిద్రలోనే లోకేష్‌ను కలవరిస్తున్న భువనేశ్వరీదేవి ముఖంపై నీళ్ళు చల్లాడు. దెబ్బకు ఆమె లేచి కూర్చుంది. అప్పటిదాకా జరిగిందంతా 'కల' అని తెలుసుకోవడానికి అర నిముషం పట్టింది. అది కల కావడంతో ఆమె ఊపిరి పీల్చుకుంది. ఏమైంది, ఎందుకు అలా కేకలు పెట్టావని చంద్రబాబు అడిగాడు. మన లోకేష్ పాదయాత్ర చేస్తే పరిస్థితి ఎలా వుంటుందో ఆమె తనకొచ్చిన కల ద్వారా చంద్రబాబుకు వివరించింది.



# ఎరుపెక్కిన నెల్లూరు

- ఘనంగా జరిగిన సిఐటియు 15వ మహాసభలు
- పాల్గొన్న త్రిపుర మాజీ సీఎం మాణిక్‌సర్కార్
- వేలాదిమంది కార్మికులతో ఎర్రజెండాల ప్రదర్శన



15వ తేది నెల్లూరులోని విఆర్ కాలేజీ మైదానంలో సిఐటియు(సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్‌యూనియన్స్) స్వర్ణోత్సవ 15వ రాష్ట్ర మహాసభలు పెద్దఎత్తున ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా సిపిఎం అనుబంధ కార్మికసంఘాలు నగరంలో మహాప్రదర్శన నిర్వహించాయి. రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిమంది కార్మికులు ఎర్రజెండాలతో ఈ ప్రదర్శనలో పాల్గొనడంతో నగరం హోరెత్తిపోయింది. సాయంత్రం విఆర్‌సి మైదానంలో జరిగిన భారీసభలో త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్‌సర్కార్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మారుతోందని విమర్శించారు. జనవరి 8న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెకు అన్ని వర్గాల కార్మిక సంఘాలు తరలివచ్చి కేంద్రప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాలని, సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అధికార దాహంతో ఒకవర్గాన్ని లక్ష్యంగా చేసుకుని బిజెపి ప్రభుత్వం దేశప్రజలపై సర్జికల్ స్ట్రైక్ ప్రారంభించిందని, బీజెపి విధానాలతో దేశంలో ఆర్థికసంక్షోభం తలెత్తనుందని విమర్శించారు. మత ప్రాతిపదికన బిల్లు తేవడంతో ఈశాన్యరాష్ట్రాలు రావణకాష్టంలా రగులుకుంటున్నాయన్నారు. కార్మికవ్యతిరేక విధానాలు అవ లంభిస్తూ దేశవ్యాప్తంగా కార్మికులను కష్టాల పాలుచేస్తోందని, కార్మికులు ఉద్యమించి బిజెపికి తగు గుణపాఠం చెప్పాలన్నారు.

### ప్రత్యేకహోదాను విస్మరించిన పార్టీలు

**- బివి రాఘవులు**

సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు, సిఐటియు రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బివి రాఘవులు ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో తెలుగుదేశం, వైయస్సార్సీపి, జనసేన పార్టీల గొంతులు మూగపోయాయని, రాష్ట్రానికి ప్రత్యేకహోదా విషయాన్ని ఆ పార్టీలు విస్మరించాయని విమర్శించారు. కార్మిక చట్టాల విషయంలో కేంద్రం నిర్లక్ష్యంగా ఉందని, 44 చట్టాలను 2 చట్టాలుగా మార్చేందుకు కేంద్రం బిల్లు ప్రవేశపెడితే టిడిపి, వైఎస్సార్సీపి ఎంపీలు నోరు మెదపకపోవడం విచారకరమని అన్నారు. జిఎస్‌టి నుంచి రాష్ట్రాలకు రావాల్సిన వాటా నిధులు కూడా కేంద్రం ఇవ్వడం లేదని దుయ్యబట్టారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు నర్సింహారావు, గఫూర్, ఎమ్మెల్సీలు శ్రీనివాసులురెడ్డి, విఠపు బాలసుబ్రహ్మణ్యం, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ధనలక్ష్మి, సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రరాజగోపాల్, నాయకులు నాగేశ్వరరావు, అజయకుమార్, పుల్లయ్య, పుణ్యవతి, ప్రభావతి తదితరులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ కార్మికవ్యతిరేక విధానాలను విమర్శించారు.

### అలరించిన సుద్దాల అశోక్‌తేజ గీతాలు

ఈ సందర్భంగా ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ ఆలపించిన అభ్యుదయగీతాలు, హాస్యవల్లరి శంకర నారాయణ, ప్రముఖ సినీ, టీవీ గాయకులు రేణు, రాజులతో పాటు ప్రజానాట్య మండలి గేయాలు అందరినీ ఆకట్టుకున్నాయి. తొలుత స్థానిక కస్తూరిదేవి గార్డెన్స్‌లో పతాకావిష్కరణ నిర్వహించి, అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు.

### ఆకట్టుకున్న గోరటి వెంకన్న గేయాలు

సిఐటియు రాష్ట్ర మహాసభల సందర్భంగా 16వ తేదీన సిఐటియు జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ పాల్గొని 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ప్రముఖ ప్రజాకవి గోరటి వెంకన్న గేయాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ సంస్కృతి సంప్రదాయాలను గుర్తు చేశారు. రానురాను కళలు అంతరించి హీనమైన సంస్కృతి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. సినిమాల్లో అశ్లీలతను, హింసాత్మకతను నిషేధించాలన్నారు. మతం ఉన్మాదం కాకూడదని, మానవత్వమే మతమని అన్నారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావుతో పాటు స్థానిక సిపిఎం, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

### ఉర్రూతలూగించిన మంగ్లీ పాటలు

17వ తేదీ మహాసభల ముగింపు కార్యక్రమంలో భాగంగా ప్రముఖ గాయని మంగ్లీ పాల్గొని తనదైన శైలిలో తెలంగాణ యాస, నెల్లూరు యాసతో కలిపి పాడిన పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ప్రస్తావిస్తూ ఆమె చేసిన ప్రసంగం అందరినీ ఆలోచింపజేసింది.

### మీడియా పట్ల ప్రభుత్వ తీరు మంచిది కాదు

**- తెలకపల్లి రవి**

ఈ మహాసభలకు విచ్చేసిన ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి స్థానిక జెట్టి శేషారెడ్డి విజ్ఞానకేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'సాహిత్య ప్రస్థానం-మాతృభాషా మాధ్యమం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మీడియా పట్ల వ్యవహరిస్తున్న తీరు మంచిదికాదన్నారు. ప్రభుత్వం దీనిపై పునరాలోచించాలన్నారు. శాసనసభలో రాజకీయాలకంటే మీడియాపైనే ఎక్కువ చర్చ జరుగుతోందని, అసెంబ్లీలో 16 బిల్లులు తీసుకొచ్చినా వాటిపై మాత్రం చర్చ జరగలేదని విమర్శించారు. సిపిఎం నాయకులు కందమూరు మురళి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# మూలస్థానేశ్వరుని హుండీ ఆదాయం రూ.7.55లక్షలు

నెల్లూరు మూలాపేటలోని శ్రీ భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఈనెల 13న హుండీ కానుకలను లెక్కించారు. సెప్టెంబర్ 12 నుంచి డిసెంబర్ 12 వరకు భక్తులు కానుకల రూపంలో రూ.7,55,155లు సమర్పించారని ఆలయ వర్గాలు తెలిపాయి. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ నెల్లూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ చైతన్య, ఆలయ కార్యనిర్వహణాధికారి ఆరంబాకం వేణుగోపాల్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# తడలో ప్రధాని మోడీ సోదరుడు



భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ సోదరుడు ప్రహ్లాద్ మోడీ బుధవారం తిరుమల, శ్రీకాళహస్తి క్షేత్రాలను దర్శించుకుని రోడ్డు మార్గాన చెన్నైకి వెళుతూ తడలోని స్వాతి రెస్టారెంట్ వద్ద కాసేపు ఆగారు. అక్కడే ఆయన కుటుంబసభ్యులు భోజనం చేశారు. ప్రహ్లాద్ మోడీని రెస్టారెంట్ యజమాని రమణారెడ్డి శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికాడు.

# జొన్నవాడ ఇ.ఓగా శ్రీనివాసులురెడ్డి



జొన్నవాడలోని మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా ఏ.వి.శ్రీనివాసులురెడ్డిని నియమిస్తూ దేవాదాయ శాఖ కార్యదర్శి వి.ఉషారాణి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఇ.ఓగా వున్న ఆర్ఎన్ కృష్ణారెడ్డిని ప్రభుత్వానికి రిపోర్ట్ చేసుకోవాల్సిందిగా ఆదేశించారు. కార్తీకమాసంలో దేవస్థానంలో చోటు చేసుకున్న కొన్ని సంఘటనలపై కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి సీరియస్ కావడం తెలిసిందే! భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా వ్యవహరించిన ఆలయ అధికారులు, సిబ్బందిపై అప్పుడే ఆయన ఆగ్రహించాడు. ఈ పర్యవసానాల నేపథ్యంలోనే ఇ.ఓ బదిలీ జరిగినట్లు తెలుస్తోంది.

కొత్తగా ఇ.ఓగా వచ్చిన ఏ.వి.శ్రీనివాసులురెడ్డి గతంలో శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం, నెల్లూరు గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం, తూర్పు కనుపూరులోని శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానాలతో పాటు ఇంకా జిల్లాలో పలు దేవస్థానాలకు ఇ.ఓగా పనిచేసి మంచిపేరు తెచ్చుకున్నారు.

# మాట తప్పిన ముఖ్యమంత్రి



కోటంరెడ్డి శీనయ్య

ప్రతి పేదవాడికి సన్న బియ్యం ఇస్తానని చెప్పి అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి జగన్ మాట తప్పారని నుడా మాజీ ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి విమర్శించారు. ఈనెల 18న నెల్లూరు ఎన్టీఆర్ భవన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ప్రజలకు అందకుండా చేసేందుకే వాలంటీర్లు, సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. అమ్మ ఒడిని ఇవ్వకుండా తప్పించుకునేందుకు రేషన్ కార్డులను తొలగిస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మూడు రాజధానులు ఏర్పాటు చేయడమేమిటని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు ఉచ్చి భువనేశ్వర ప్రసాద్, ఖాజావలి, మధు, సత్యనాగేశ్వరరావు, ఆర్వేటి శేషయ్య, జెన్ని రమణయ్య, అంచూరి శ్రీనివాసులు నాయుడు, పసుపులేటి మల్లి, చీదెళ్ల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# 22న శ్రీవారి కల్యాణం



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న సంస్థ సభ్యులు

తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్, శ్రీ వేంకటేశ్వర కల్యాణ మహోత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 22వతేది ఆదివారం ఉదయం 9గంటలకు నెల్లూరు రంగనాయకులపేటలోని సోమిశెట్టి కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరుని కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు సేవాసమితి అధ్యక్షులు కళాదీప్తి సుబ్రహ్మణ్యం, టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ మాజీ కో-ఆర్డినేటర్ మల్లెల శ్రీహరి, వేద పండితుడు వేదగిరి ఫణిశర్మ, సేవాసమితి సభ్యులు మద్దిక కృష్ణారెడ్డి, శీలం వెంకట సురేష్‌కుమార్ తెలిపారు. ఈనెల 19న నగరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తొలుత వారు ఆహ్వానపత్రికలు ఆవిష్కరించారు. అదే విధంగా ఈనెల 23వతేదీన ఉదయం 9గంటలకు శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని కల్యాణోత్సవాలను తిలకించి స్వామి వార్ల కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని కోరారు.

## వేలం ద్వారా రవాణాశాఖకు 2.47 లక్షల ఆదాయం

ఎలాంటి పత్రాలు లేకుండా వెళ్తూ రవాణా అధికారుల తనిఖీల్లో పట్టుబడిన పలు వాహనాలను ఈనెల 18న నెల్లూరులోని బివినగర్‌లో ఉన్న రవాణా కార్యాలయంలో వేలం వేయగా రవాణాశాఖకు 2,47,500 రూపాయలు ఆదాయం లభించింది. ఈ వేలంలో డిటిసి సుబ్బారావు, సూపరింటెండెంట్ మదానీ పాల్గొన్నారు.

## హెడ్‌క్వార్టర్స్‌కు ఇద్దరు సీఐలు

నెల్లూరు నవాబుపేట సీఐ కె.వేమారెడ్డి, సీసీయస్ సీఐ బాజీజాన్ సైదాలు జిల్లా పోలీస్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఈనెల 18న జిల్లా ఎస్పీ భాస్కర భూషణ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన సీఐలను జిల్లా పోలీసు కార్యాలయానికి పిలిపిస్తూ తొలి ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది.

## శబరిమలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

శబరిమలకు వెళ్లే అయ్యప్పస్వామి భక్తుల సౌకర్యం కోసం ఆర్టీసి నెల్లూరు రీజియన్ నుంచి ప్రత్యేకబస్సులు ప్రారంభమయ్యాయి. ఈనెల 18న నెల్లూరు 1వ డిపో ఆధ్వర్యంలో నగరంలోని అయ్యప్ప గుడి నుంచి శబరిమలకు వెళ్ళే ప్రత్యేక బస్సును ఆర్టీసి రీజనల్ మేనేజర్ ఆర్ఎం రామమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శబరిమలకు వెళ్ళే భక్తులకు ఈ ప్రత్యేక బస్సులు సౌకర్యంగా ఉంటాయని, భక్తులు ఈ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు. నెల్లూరు 1వ డిపో మేనేజర్ విశ్వనాథ్, అసిస్టెంట్ మేనేజర్ కెవిఆర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డ్‌గా మారిన ఖాళీ స్థలం

నెల్లూరు రాజేంద్రనగర్ మోడల్ హైస్కూలు ఎదురుగా గోషా మహల్‌కు చెందిన ఖాళీ స్థలంను డంపింగ్ యార్డుగా ఉపయోగించడం వల్ల ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ నాయకుడు యశ్వంత్ సింగ్ పేర్కొన్నారు. ఈనెల 16 న ఆయన మాట్లాడుతూ గత రెండు నెలలుగా పారిశుద్ధ్య కార్మికులు చెత్తను ఇక్కడ పోయడం వల్ల దుర్గంధం వ్యాపిస్తుందన్నారు. అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు బీజేపీ కార్యకర్తలు కరపత్రాలు పంచి నిరసన తెలిపారు. వెంకటేష్, నాగమోహన్, సుభాన్, అబ్దుల్, నయూబ్ తదితరులు పాల్గొన్నారు.

## హైవేపై ముమ్మరంగా విజిలెన్స్ దాడులు

- 30వేల కేజీల పిడిఎస్ బియ్యం పట్టివేత
- 6 గ్రానైట్ లారీలు స్వాధీనం

అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై విజిలెన్స్ బృందాలు కఠినచర్యలు తీసుకుంటున్నాయి. అక్రమార్కుల భరతం పట్టేందుకు ముమ్మరంగా దాడులు ప్రారంభించాయి. జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఎస్‌వి శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు, సిబ్బంది నెల్లూరు సమీపంలోని వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద 17, 18తేదీల్లో రెండు రోజులు కాపుకాసి అక్రమరవాణా చేస్తున్న పలు వాహనాలను పట్టుకున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ద్వారా ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న బియ్యాన్ని అక్ర మంగా తరలించేవారిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ బియ్యాన్ని కృష్ణపట్నం పోర్ట్ నుంచి విదేశాలకు కూడా తరలిస్తున్నట్లుగా విజిలెన్స్ అధికారులకు సమాచారం ఉండ డంతో వాటిపై ప్రత్యేకనిఘా పెట్టారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లి మండలం కొమ్మెరపూడి గ్రామంలోని ఒక రైస్‌మిల్లు నుంచి 600 బస్తాల (30వేల కేజీలు) పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న లారీని పట్టుకుని పౌరసరఫరాలశాఖ అధికారులకు అప్పగించారు. లారీ డ్రైవర్‌తో పాటు ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై 6-ఏ కేసు నమోదు చేశారు. అదేవిధంగా ఈనెల17వ తేది అర్ధరాత్రి సమయంలో అధికలోడుతో కృష్ణపట్నం పోర్ట్‌కు వెళ్తున్న గ్రానైట్ లారీలను తనిఖీచేశారు. 6 లారీలకు సరైన పత్రాలు లేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకుని రవాణాశాఖ అధికారులకు అప్పగించారు. ఈ లారీలకు అధికారులు 1,03,900 రూపాయలను జరిమానా విధించారు. తదుపరి చర్యల కోసం గనుల శాఖ అధికారులకు అప్పగించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఓఎస్డీ పి.వెంకటనాథ్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు సి.మాణిక్యాలరావు, వి.సుధాకర్‌రెడ్డి, పివి నారాయణ, సిబ్బంది డి.బాలయ్య, బి.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

## రాష్ట్రానికి 'రాజ'యోగం

(మొదటి పేజీ తరువాయి)

గతానుభవాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర రాజధాని విషయంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఒక కీలక నిర్ణయం తీసుకోబోతున్నాడన్న సంకేతాలు ఇప్పటికే వెలువడ్డాయి. ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా హైదరాబాద్ చుట్టూనే అభివృద్ధిని కేంద్రీకృతం చేశారు. అందరు ముఖ్యమంత్రులు కూడా దాని అభివృద్ధికే ప్రాధాన్యతనిచ్చారు. దాని పర్యవసానాలేమిటో 2014లో రాష్ట్ర విభజన సమయంలో చూశాము. దాదాపు 60ఏళ్ల పాటు ఉమ్మడి ఆదాయంతో అభివృద్ధి చేసుకున్న హైదరాబాద్ నగరాన్ని వదులుకునేటప్పుడు ఆంధ్రులు పడిన బాధ అంతా ఇంతా కాదు. అభివృద్ధినంతా హైదరాబాద్ చుట్టే కేంద్రీకరించే బదులు, దానికి ప్రత్యామ్నాయంగా ప్రాంతాల వారీగా ఇంకో రెండు, మూడు నగరాలను అభివృద్ధి చేసివుంటే ఎవరికీ ఇంత బాధ వుండేది కాదుకదా అనే అభిప్రాయం కూడా సర్వత్రా వినిపించింది.

### ఆ తప్పు... పునరావృతం కాకూడదనే!

రాజధాని విషయంలో చరిత్రలో జరిగిన తప్పిదం మరోసారి పునరావృతం కాకూడదనే ఆలోచనతోనే జగన్ సర్కార్ అభివృద్ధి వికేంద్రీకరణ దిశగా కీలక నిర్ణయం తీసుకోనుంది. రాష్ట్రంలోని కోస్తా, ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు అభివృద్ధిలో సమభాగం కల్పిస్తూ మూడు ప్రాంతాలలో మూడు రాజధానుల ఏర్పాటు దిశగా ప్రణాళిక రూపొందిస్తోంది. ప్రస్తుతమున్న అమరావతిని లెజిస్లేటివ్ రాజధానిగా, విశాఖపట్నంను ఎగ్జిక్యూటివ్ రాజధానిగా, కర్నూలును జ్యూడీషియల్ రాజధానిగా మార్చబోతోంది. ఈమేరకు త్వరలో నివేదిక కూడా రాబోతుందని, నివేదిక వచ్చాక రాజధానులపై సమగ్ర కార్యాచరణ రూపొందుతుందని అసెంబ్లీలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రకటించాడు.

### వికేంద్రీకరణ మంచిదే

అభివృద్ధి వికేంద్రీకరణ ఆలోచన చాలామంచిది. దీనివల్ల అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందే అవకాశముంటుంది. లెజిస్లేటివ్ రాజధానిగా అమరావతి ఉండబోతుంది. ఇంతవరకే పరిమితమైతే ఇక ఇక్కడ అదనపు నిర్మాణాలు కూడా అవసరం లేదు. పెద్ద ఖర్చు కూడా వుండదు.

పరిపాలనా రాజధానిగా విశాఖపట్నంను ఎంచుకోవడం సరైన నిర్ణయమే. మన రాష్ట్రంలో హైదరాబాద్ లాంటి మంచి వాతావరణం వుండే నగరం విశాఖపట్టణమే. ఇక్కడ అన్ని కులాలు, మతాల వాళ్ళు, ఇతర రాష్ట్రాల వాళ్ళు కూడా ఐక్యమత్యంతో జీవిస్తుంటారు. కులాధిపత్య పోకడలు వుండవు. సాగరతీరాన ఉండడంతో ఆహ్లాదకర వాతావరణం వుంటుంది. పర్యాటకంగా కూడా అభివృద్ధి చెందిన ప్రాంతం. ముఖ్యంగా సచివాలయ, ఇతర అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు స్థిరనివాసం ఏర్పరచుకుని వుండగల ప్రాంతం. ఇప్పుడు అమరావతిలో సచివాలయం వుంటే అధికారులు అక్కడ స్థిర నివాసం వుండలేకపోతున్నారు. హైదరాబాద్‌ను వదిలి రాలేకున్నారు. శుక్రవారం మధ్యాహ్నంకల్లా లగేజీ సర్దుకుని హైదరాబాద్‌కు బయలుదేరడం తిరిగి సోమవారం మధ్యాహ్నానికి రావడం... దీనివల్ల సచివాలయంలో పనులు నత్తనడక సాగిస్తున్నాయి. సచివాలయమున్న చోటే సిబ్బంది కూడా నివాసముంటే ఆ పనిలో వేగం వుంటుంది. అంతేకాదు, ప్రజాప్రతినిధులు కూడా ఇక్కడైతే స్థిరంగా వుండడానికి అవకాశముంటుంది. అయితే అనంతపురం, చిత్తూరు, కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాల వారికి మాత్రం బాగా దూరంగా వున్నట్లని పిస్తుంది. అయితే పరిపాలన రాజధానితో ప్రజలందరికీ పెద్దగా అవసరాలుండవు. నాయకులు, పెద్దపెద్ద కాంట్రాక్టర్లు, పారిశ్రామికవేత్తలు, ఉన్నతాధికారులకే పనులుంటాయి. వాళ్ళకు విశాఖపట్నం వెళ్లిరావడం పెద్ద సమస్య కాకపోవచ్చు.

ఇక కర్నూలును జ్యూడీషియల్ రాజధాని చేయడం సముచిత నిర్ణయమే. అసలు ఆంధ్ర రాష్ట్రానికి తొలి రాజధాని కర్నూలే! అది అలాగే కొనసాగివుంటే ఈరోజు కర్నూలు మహానగరంగా అభివృద్ధి చెంది వుండేది. మధ్యలో హైదరాబాద్‌కు మార్చేసి కర్నూలుకు అన్యాయం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే రాష్ట్రానికి కర్నూలును రెండో రాజధానిగా చేయాలని, కర్నూలులో హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలనే డిమాండ్లు వున్నాయి. ఇప్పుడు జగన్ నాయకత్వంలో కర్నూలుకు ఆ వైభవం రాబోతోంది. రాయలసీమకు ఈ రకంగా న్యాయం చేసినట్లయ్యింది.

### బాబు టీమ్‌కు... కోలుకోలేని షాక్

జగన్ సర్కార్ తీసుకున్న మూడు రాజధానుల నిర్ణయంతో చంద్రబాబు బృందం ఖంగుతింది. 3 రాజధానులు ఎలా ఏర్పాటు చేస్తారంటూ గగ్గోలు పెడుతోంది. చంద్రబాబు టీమ్ అమరావతి కేంద్రంగా ఎన్నో ఆశలు పెంచుకుంది. 2014లో అధికారంలోకి వచ్చిందే తడవుగా రాజధానిపై ఏర్పాటు చేసిన శివరామకృష్ణన్ కమిటీ సిఫార్సులను పక్కకు నెట్టేసి, ఆ కమిటీ వద్దు మొర్రో అని మొత్తుకుని చెప్పినా అమరావతిని రాజధానిగా నిర్ణయించింది. మూడు పంటలు పండే బంగారం లాంటి 33వేల ఎకరాల భూములను రైతుల నుండి లాక్కుంది. వేసిన పంటలను నాశనం చేశారు. సింగపూర్ డిజైన్‌లన్నారు... ఇడ్లీ పాత్రల డిజైన్‌లు గీయించారు... అమరావతి అలా వుంటుంది, ఇలా వుంటుందంటూ పంచ రంగుల్లో గ్రాఫిక్స్ చూపించారు. రాజధాని విషయాన్ని ముందే లీక్ చేసి అనుచరుల చేత భూములు కొనిపించారు. అనుయాయులకు రాజధానిలో రైతుల నుండి లాక్కున్న భూములను కారుచౌకగా అప్పగించారు. తెలుగుదేశం ప్రభుత్వంలో అమరావతి రాజధాని అన్నది ఒక పెద్ద భూకుంభకోణంగా చెప్పుకోవచ్చు. చంద్రబాబు స్కెచ్ గీసినట్టు ఈ రాజధానిని కనీసం రోడ్లు, డ్రైన్లు వేసి అభివృద్ధి చేయాలన్నా లక్ష కోట్ల పైమాటే ఖర్చవుతుంది. దానిని తప్పించేందుకే జగన్మోహన్‌రెడ్డి ఎవరికీ ఇబ్బంది లేని విధంగా, పెద్దగా ఖర్చు లేనంతగా, అన్ని ప్రాంతాలకు ఆమోదయోగ్యంగా 3 రాజధానులను ప్రకటించాడు.

అమరావతిని కేవలం లెజిస్లేటివ్ రాజధానిగా చేయడంతో అక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒక్కసారిగా పడిపోయినట్లే! ముఖ్యంగా తెలుగుదేశంవాళ్ళకు ఇది పెద్ద దెబ్బ. పెద్దఎత్తున ఇక్కడ భూములు కొని పెట్టివుండేది వాళ్ళే! అందుకే వాళ్ళు శోకండాలు పెట్టేది కూడా!

## నెల్లూరంటే... నిర్లక్ష్యమా?

(మొదటి పేజీ తరువాయి)

ఈ రెండు జిల్లాల్లో అటు కోస్తా సంస్కృతి సగం ప్రాంతంలో, రాయలసీమ సంస్కృతి ఇంకో సగం ప్రాంతంలో వుంటుంది. పేరుకు ఇవి రెండూ కోస్తా జిల్లాలే అయినా రాయలసీమలోనూ ఒక భాగంగా వుంటాయి. అందుకేనేమో గతంలో గ్రేటర్ రాయలసీమ ఉద్యమం నడిపిన వాళ్ళు ఈ రెండు జిల్లాలను కలుపుకునే రాయలసీమకు ప్రత్యేక రాష్ట్రం కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు ప్రాంతాలలో ప్రకటించిన రాజధానుల వల్ల ఈ రెండు జిల్లాల వారికి పెద్దగా ఉపయోగముండదు. నెల్లూరు, ప్రకాశం, చిత్తూరుజిల్లాల కూడలిగా అభివృద్ధికి బీజాలు నాటాల్సివుంది. ఈ మూడు జిల్లాల్లో పారిశ్రామిక, పర్యాటక, ఆధ్యాత్మిక పరమైన అభివృద్ధికి మెరుగైన అవకాశాలున్నాయి. ముఖ్యంగా నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో బీడుభూములు ఎక్కువగా వున్నందువల్ల పరిశ్రమల స్థాపనకు అవకాశముంది. ప్రకాశం జిల్లాలో మైనింగ్ విస్తారంగా వుంది. నెల్లూరుజిల్లాలో కృష్ణపట్నం పోర్ట్, శ్రీసిటీ, మేనకూరు వంటి ప్రతిష్టాత్మకమైన పారిశ్రామికవాడలున్నాయి. చిత్తూరుజిల్లా పరిధిలో బెల్‌తో పాటు మరికొన్ని పరిశ్రమలున్నాయి. ఈ మూడు జిల్లాలను యూనిట్‌గా చేసుకుని నెల్లూరుజిల్లాను పారిశ్రామిక రాజధానిగా ప్రకటించవచ్చు.

అలాగే ఈ మూడు జిల్లాలలో పర్యాటక ప్రగతికి ఎంతో అవకాశముంది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలున్నాయి. ఆధ్యాత్మికంగా కూడా అభివృద్ధికి ఆస్కారముంది. ముఖ్యంగా నెల్లూరు, చిత్తూరుజిల్లాలు కేంద్రంగా రాష్ట్రంలో సినీ పరిశ్రమను అభివృద్ధి చేయడానికి, తెలుగు చలనచిత్ర పరిశ్రమను ఇక్కడకు రప్పించడానికి కూడా అవకాశముంది.

కాబట్టి రాజధాని ముసుగులో అభివృద్ధిని కేంద్రీకరించాలని గత సీఎం చంద్రబాబు చేసిన కుటిల యత్నాలను పటాపంచలు చేస్తూ... అభివృద్ధి వికేంద్రీకరణకు కొత్త మార్గం ఎంచుకున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆ పరంపరలో కొంచెం నెల్లూరు, ప్రకాశం జిల్లాలపై కూడా దృష్టి పెట్టాల్సివుంది.

### 'నిల్లు'ఊరు చేస్తారా?

'నెల్లి' అంటే వడ్లు... వరిపంటకు ప్రసిద్ధి చెందింది కాబట్టి 'నెల్లూరు' అనే పేరొచ్చిందని నానుడి. అలాంటి నెల్లూరును రాష్ట్ర ప్రభుత్వాలు 'నిల్లు'ఊరుగా మారుస్తున్నాయేమోనని పిస్తుంది. దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి హయాంలో నెల్లూరుజిల్లాలో పారిశ్రామిక ప్రగతికి పునాది పడింది. కృష్ణపట్నం పోర్ట్, మేనకూరు, శ్రీసిటి, చింతవరం, మాంబట్టు, ఇఫ్కో సెజ్‌లు ఆయన పుణ్యమే! జిల్లాలో కొన్ని లక్షల మంది ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆయన చేపట్టిన పారిశ్రామిక అభివృద్ధి ప్రక్రియ మూలంగా లబ్ధిపొందారు. ఆయన పాలన జిల్లావరకు ఒక స్వర్ణయుగమే!

ఆ తర్వాత ముఖ్యమంత్రులుగా వచ్చిన కె.రోశయ్య గాని, కిరణ్‌కుమార్‌రెడ్డి గాని నెల్లూరుజిల్లా అభివృద్ధిపై పెద్దగా దృష్టి సారించలేదు. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడైతే నెల్లూరుజిల్లా పట్ల తన పార్టీకి సీట్లు తక్కువ వచ్చాయని చెప్పి కక్ష కట్టినట్లుగా వ్యవహరించాడు. నెల్లూరుజిల్లా ప్రగతికి ఏ విధంగానూ తోడ్పడలేదు.

తనకు సీట్లు రాలేదని ఆయన అలా చేస్తే, ఇప్పుడు జగన్మోహన్‌రెడ్డి నెల్లూరంతా మనదే కదా అనుకున్నట్లుంది. మనవాళ్ళకు మనం ఏమీ చేయకపోయినా ఫరవాలేదులే అన్నట్లుగా నెల్లూరుపై ఇంకా పెద్దగా దృష్టి పెడుతున్నట్లు కనిపించడం లేదు. మొత్తానికి నెల్లూరు అటూ ఇటూ కాని "నిల్లు" ఊరుగా మారిపోయే ప్రమాదముందేమోనన్నది మేధావుల అభిప్రాయం.

దాదాపు పదేళ్లుగా నెల్లూరుజిల్లా పాలకుల పక్షపాతానికి, నిర్లక్ష్యానికి గురవుతోంది. వైసిపికి కంచుకోటలాంటి జిల్లా ఇది. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా వైసిపి ఇక్కడ మొన్న ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేసింది. తనను ఇంతగా ఆదరించిన నెల్లూరుజిల్లా ప్రజల పట్ల కూడా జగన్ తన అభిమానాన్ని చూపించుకోవాల్సిన సమయం వచ్చింది.

# ప్రథమ వర్ధంతి



## పూజ్యులు అల్లూరు కౌసల్యమ్మ గారు

(కీ॥శే॥ అల్లూరు చిన మస్తానయ్యనాయుడు గారి ధర్మపత్ని)

శ్రీరామపురం

**అమ్మమ్మా!**
**మీరు మాపై చూపిన**
**ప్రేమ, ఆప్యాయతలు**
**జన్మజన్మలకు మరువలేనివి.**

ప్రథమవర్ధంతి సందర్భంగా
హృదయపూర్వకంగా స్మరించుకుంటూ...

మనుమడు :
**హర్షవర్ధన్ ముప్పవరపు**
ఛైర్మన్, ముప్పవరపు ఫౌండేషన్

మనుమరాలు :
**దీపావెంకట్ ఇమ్మణ్ణి**
మేనేజింగ్ ట్రస్టీ, స్వర్ణభారత్ ట్రస్ట్

కౌసల్యమ్మ గారి
ప్రథమ వర్ధంతి సందర్భంగా

స్వర్ణభారత్ ట్రస్ట్ వెంకటాచలం
ముప్పవరపు ఫౌండేషన్
Gleneagles Global Health City
A PARKWAY PANTAI ENTERPRISE
ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి
& నారాయణ దంత కళాశాల వారి సౌజన్యంతో

గుండె, జీర్ణకోశ (గ్యాస్ట్రో),
ఊపిరితిత్తులు, నెమ్ము, దగ్గు,
కంటి, దంత & సాధారణ వ్యాధుల

# ఉచిత మెగా వైద్యశిబిరం

మరియు

# మెగా రక్తదాన శిబిరం

రక్తదానమే ప్రాణదానం - దాతలే దేవుళ్ళు

ప్రారంభకులు
**శ్రీమతి ముప్పవరపు ఉషమ్మ**

ముఖ్య అతిథులు

**డా॥ జి. మునిరత్నం నాయుడు**
ప్రధాన కార్యదర్శి, రాష్ట్రీయ సేవాసమితి (RASS)

**డా॥ కామినేని శ్రీనివాస్**
ఛైర్మన్, స్వర్ణభారత్ ట్రస్ట్

**డా॥ కె. రవీంద్రనాథ్**
MS, FRCS (Edin) FRCS (Glasg)
Founder & Chairman, Gleneagles Global Hospital.

ఉచితంగా అందజేయు సేవలు :
- E.C.G.
- 2D Echo గుండె పరీక్ష
- బి.పి. పరీక్షలు
- మందులు

ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగించుకోగలరు.
వివరములకు:
0861-2383504,
7569798890, 9849216626.

తేది : 20-12-2019 శుక్రవారం ఉ॥ 9.30 గం॥ల నుండి మ॥ 1.30 గం॥ల వరకు స్వర్ణభారత్ నాలెడ్జ్ సెంటర్, రిత్విక్ ఎన్‌క్లేవ్, నెల్లూరు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com